

విడవని జడివాన

బైరెడ్డిపల్లెలో 92.4 మిమీ వర్షం



బైరెడ్డిపల్లె మండలంలో మొరవపోతున్న తీర్థం వెంకటపతయ్యచెరువు



యాదమరి మండలం భూమిరెడ్డిపల్లి వద్ద మొరవ పారుతున్న నుంజర్ల ప్రాజెక్టు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణి ప్రభావంతో నాలుగు రోజులుగా జిల్లావ్యాప్తంగా విడవకుండా వర్షాలు కురుస్తున్నాయి.సెప్టెంబరు నెల సగటు వర్షపాతం 157 మిమీ కాగా శుక్రవారం నాటికే సగటుకు మించి 159.5 మిమీ వర్షపాతం నమోదయ్యింది. గడచిన 24 గంటల్లో అత్యధికంగా బైరెడ్డిపల్లెలో 92.4, అత్యల్పంగా రొంపిచెర్లలో 3 మిమీ వర్షం కురిసింది. మండలాలవారీగా వి.కోటలో 90.6, రామకుప్పంలో 88, గుడిపాలలో 80.4, యాదమరిలో 68.4, గంగవరంలో 57.8, బంగారుపాళ్యంలో 52, చిత్తూరు అర్బన్‌లో 51.4, పలమనేరులో 48.2, చిత్తూరు రూరల్‌లో 45.6, నగరిలో 45.6, పెద్దపంజాణిలో 43.2, గంగాధరనెల్లూరులో 37, కార్వేటినగరంలో 36.8, కుప్పంలో 36, శాంతిపురంలో 35.8, తవణంపల్లెలో 34.2, సదుంలో 28.2, సోమలలో 26.8, పుంగనూరులో 24.6, గుడుపల్లిలో 20.4, చౌడేపల్లెలో 20, పాలసముద్రంలో 19.4, శ్రీరంగరాజపురంలో 19.2, విజయపురంలో 16.2, ఐరాలలో 15, పూతలపట్టులో 9.2, వెదురుకుప్పంలో 6.4, నింద్రలో 6.2, పెనుమూరులో 5.6 మిమీ వర్షపాతం నమోదైంది.

చెలిమిచేను పరవళ్లు



రామకుప్పం,సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది.అటవీప్రాంతంలోని వాగులు, వంకలు, చెక్ డ్యాంల నుంచి వస్తున్న వర్షపునీటితో వీర్నమల సమీపంలోని చెలిమిచేను జలపాతం పరవళ్ళు తొక్కుతోంది. జలపాతం పైబాగంలో బండరాళ్ళ మీదుగా ఉధ్రుతంగా జలాలు ప్రవహిస్తున్నాయి.సుమారు 200 అడుగుల కిందకు జాలువారుతున్నాయి.

నిండుకుండలా కృష్ణాపురం జలాశయం



వెదురుకుప్పం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలంలోని కృష్ణాపురం రిజర్వాయర్ వర్షపు వరద నీటితో నిండుకుండలా మారింది. కృష్ణాపురం ప్రాజెక్టు నీటిమట్టం 213.00మీటర్లు కాగా ప్రస్తుతం 210మీటర్ల ఎత్తుకు నీరు చేరింది.శనివారం సాయంత్రం లేదా ఆదివారం గేట్లను ఎత్తి కృష్ణాపురం జలాశయం నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం వుందని ఇరిగేషన్ ఏఈఈ వీఎస్ భాస్కర్‌రాజీవ్ శుక్రవారం రాత్రి తెలిపారు.

హంద్రీ-నీవా కాలువకు గండి

వి.కోట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వి.కోట మండల పరిధిలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షంతో హంద్రీ-నీవా కాలువకు వెంకటేపల్లె వద్ద గండి పడింది. యర్రంపల్లెకు ఎగువనున్న కాలువ గట్టు పక్కన రెండు విద్యుత్ స్తంభాలు గాలుల తీవ్రతకు నేలకొరిగాయి. దీంతో కొడగల్లు వద్ద హంద్రీ-నీవా కాలువపై ఉన్న పంప్ హౌస్‌కు విద్యుత్ సరఫరా ఆగింది.మోటార్లు పనిచేయక పోవడంతో హంద్రీ నీవా కాలువలో నీటి ప్రహం పెరిగి వెంకటేపల్లె వద్ద కాలువ కుడి వైపు గండి పడింది. నిల్వ ఉన్న నీటికి పైభాగంలో వర్షపు నీరు దిగువకు తరలిరావడంతో కాలువ గట్టు తెగి భారీ ఎత్తున నీరు దిగువనున్న పొలాల్లోకి ప్రహించాయి. చిన్నశ్యామ చెరువు పూర్తిగా నిండి నాగిరెడ్డిపల్లె చెరువుకు మొరవ ప్రవహిస్తోంది. మార్గమధ్యంలోని సుమారు వంద ఎకరాల్లో పంట పొలాలు నీటమునిగాయి. హంద్రీ-నీవా కాలువలో దిగువనున్న ప్రాంతాలకు నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది.ట్రాన్స్‌కో ఏఈ రామకృష్ణ సిబ్బందితో కలిసి విద్యుత్ స్తంభాలను మార్చి మధ్యాహ్నానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. అలాగే మోట్లపల్లె లిఫ్ట్ యూనిట్‌కు సరఫరా పునరుద్ధరించి మోటార్లు ఆన్ చేయడంతో శుక్రవారం మధ్యాహ్నం హంద్రీనీవా కాలువలో నీరు తిరిగి ప్రవహించడం మొదలైంది.







కమతమూరులో వీధిలైట్లకు సోలార్ సెన్సార్ సాంకేతికతను ప్రారంభిస్తున్న పీఏసీఎం, ప్రతాప్ తదితరులు

కుప్పంలో సోలార్ సెన్సార్

● వీధిలైట్లకు ఆటోమేటిక్ ఆన్ అండ్ ఆఫ్ టెక్నాలజి

కుప్పం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవడానికి ప్రభుత్వ శాఖలు ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తున్నాయి. తద్వారా ప్రజలకు మరింత మెరుగైన ప్రయోజనాలు కల్పించడానికి ముందుకొస్తున్నాయి.ప్రత్యేకించి కుప్పం పురపాలక సంఘం, కుప్పం రెస్కో ఇందులో ఒకడుగు ముందుకేశాయి. ప్రత్యేక సోలార్ సెన్సార్ పరికరాన్ని అమర్చడం ద్వారా వీధి విద్యుత్తు బల్బులు వాటికవే ఆన్ అండ్ ఆఫ్ అయ్యే సోలార్ ఫొటో సింథసిస్ టెక్నాలజీని ప్రస్తుతం వినియోగంలోకి తీసుకు వచ్చారు. పురపాలక సంఘం పరిధిలోని కమతమూరులో కుప్పం రెస్కో ద్వారా, కడా పైలెట్ ప్రాజెక్టుగా శుక్రవారం ప్రారంభించారు.ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్, రెస్కో ఎండీ సోమశేఖర్, కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్ ఈ ఆధునిక సాంకేతికతను ప్రారంభించారు. ఆధునిక టెక్నాలజీలో భాగంగా ప్రతి 24 విద్యుత్తు స్తంభాలకు కలిసి ప్రత్యేకమైన ఒక పరికరాన్ని అమర్చి విద్యుత్తు మీటరుకు అనుసంధానిస్తారు. ఈ సాంకేతికపరమైన అమరిక ద్వారా వీధుల్లోని విద్యుత్తు బల్బులు, సూర్యరశ్మి ఉన్న పగటి వేళల్లో వాటికవే ఆరిపోయి, లేని సమయంలో అంటే చీకటి పడ్డాక వాటికవే వెలుగుతాయి. ఇందువల్ల మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యంతో పగటిపూట కూడా వీధిలైట్లు వెలుగుతుండే సమస్య తప్పిపోతుంది. తద్వారా విద్యుత్తు వినియోగం అదుపులోకి వచ్చి బిల్లులు తగ్గుతాయి.మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, రెస్కో డైరెక్టర్ తులసీనాథ్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మణీంద్రం పారిశ్రామికవాడకు భూములివ్వం



రామకుప్పం-విజలాపురం రహదారిపై బైఠాయించిన రైతుకుటుంబాలు

రామకుప్పం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం మణీంద్రంలో ఏర్పాటు చేయనున్న పారిశ్రామిక వాడకు భూములిచ్చేది లేదంటూ రైతులు ఆందోళన బాట పట్టారు. మండల పరిధిలో ఏర్పాటు కానున్న విమానాశ్రయానికి చేరువలో నియోజకవర్గ ప్రజలకు ఉపాధి, ఉద్యోగ కల్పన కోసం పారిశ్రామిక వాడ ఏర్పాటు చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం మణీంద్రం గ్రామ దాఖలాలో రైతుల నుంచి 600 ఎకరాల సేకరణ మొదలెట్టింది. ఇప్పటికే పలు పరిశ్రమల ప్రతినిధులు ఈ ప్రాంతంలో పర్యటించి భూములను పరిశీలించారు. ఇక్కడ పరిశ్రమల స్థాపనకు సుముఖత వ్యక్తం చేసినట్టు సమాచారం.కొన్ని రోజులుగా రెవిన్యూ సిబ్బంది భూముల్లో నమూనాలను కూడా సేకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రైతులు ఆందోళనకు దిగారు. టీడీపీ నేత శ్రీరాములురెడ్డి, వైసీపీ నేత చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రామకుప్పం-విజలాపురం రహదారిపై బైఠాయించారు. తాము ఇప్పటికే విమానాశ్రయం, హంద్రీ-నీవా కాలువలకు భూములిచ్చామని, మళ్లీ 600ఎకరాలు ఇవ్వలేమన్నారు. ఉన్న కొద్దిపాటి భూముల్లో సేద్యం చేసుకుంటూ పాడిపరిశ్రమనే నమ్ముకుని జీవిస్తున్నామన్నారు. పరిశ్రమలకు భూములిచ్చేస్తే వీధిన పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయంలో చంద్రబాబు పునరాలోచించి తమను ఆదుకోవాలని కోరారు.ఆందోళన విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ మహేంద్ర అక్కడకు వెళ్ళి రైతులతో చర్చించారు. ఏదైనా ఉంటే అధికారులను కలిసి మాట్లాడాలని రైతులకు సూచించారు. దీంతో వారు ఆందోళన విరమించి గ్రామ సచివాలయం వద్దకు చేరుకున్నారు. కాసేపటికి అక్కడికి వీఆర్వో తేజ్‌రెడ్డి వచ్చారు. తాము పరిశ్రమల ఏర్పాటుకు భూములిచ్చేది లేదని,ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించాలని ఆయనకు వినతిపత్రం అందించారు.

ప్రాజెక్టుల పేరుతో పాతిక కోట్లు

ప్రజాధనం వృథా

వైసీపీ ప్రభుత్వ తీరును అసెంబ్లీలో దుయ్యబట్టిన సీఎం



పుంగనూరు,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం బాధ్యతారాహిత్యంతో రూ.25 కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసిందని సీఎం చంద్రబాబు నాయుడు దుయ్యబట్టారు.శాసనసభలో జలవనరుల అంశంపై శుక్రవారం మాట్లాడిన ఆయన కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధితో పాటు గత ప్రభుత్వం చేసిన తప్పులను చర్చించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణ విషయాల్లో కాంట్రాక్టర్లు చేసిన తప్పులకు అపరాధంగా వైసీపీ ప్రభుత్వం రూ.25 కోట్లు జరిమానా చెల్లించిందని గుర్తు చేశారు.పుంగనూరు మండలంలో ఒక టీఎంసీ సామర్థ్యంతో నేతిగుట్లపల్లె రిజర్వాయర్ , సోమల మండలంలో 3.5 టీఎంసీల సామర్థ్యంతో ఆవులపల్లె రిజర్వాయర్, కురబలకోట మండలంలో 2 టీఎంసీల సామర్థ్యంతో ముదివేడు రిజర్వాయర్ నిర్మాణాల కోసం రూ.2,144 కోట్లతో గత ప్రభుత్వం టెండర్లు పిలిచిందన్నారు. టెండర్లు వారి మనుషులకే ఇచ్చేలా చేయడానికి సంబంధిత మంత్రి ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించారని కూడా గుర్తుచేశారు. రిజర్వాయర్లను నిబంధనలకు విరుద్ధంగా తమకు అన్యాయం జరిగేలా నిర్మిస్తున్నట్లు నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్ (ఎన్జీటీ)ని రైతులు ఆశ్రయించారన్నారు. దీంతో రిజర్వాయర్ల నిర్మాణంపై ఎన్జీటీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ రూ.100 కోట్లు జరిమానా కృష్ణాబోర్డుకు చెల్లించాలని సంచలన తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. కాంట్రాక్టరు చేసిన తప్పులకు ప్రభుత్వమే రూ.25 కోట్లు జరిమానా చెల్లించిందని మండిపడ్డారు. హంద్రీనీవా సుజల స్రవంతి ఫేజ్-2లో కేవీపల్లె మండలంలోని అడవిపల్లె నుంచి చిత్తూరు నీవా బ్రాంచ్ కెనాల్‌కు రూ.1417.81 కోట్లతో నీటిని తీసుకెళ్లడం ద్వారా రూ.1.75లక్షల ఎకరాలకు సాగునీరు, పలుప్రాంతాలకు తాగునీరు ఇస్తామన్నారు. అలాగే లింక్ కెనాల్ నుంచి కళ్యాణ్ డ్యాంకు నీటిని తీసుకెళతామన్నారు.తనకు 8సార్లు ఓట్లు వేసి గెలిపించిన కుప్పం ప్రజలకు హంద్రీనీవా కాలువల ద్వారా కృష్ణాజలాలను అందించడంతో ఎంతో తృప్తిగా అన్పించిందని సంతోషం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం విధ్వంసం, స్వలాభం కోసం పనిచేసి చెడ్డపేరు తెచ్చుకుందని ఆరోపించారు. తాము ప్రాధాన్యత క్రమంలో పెట్టుకున్న లక్ష్యం మేరకు పనులు పూర్తి చేస్తామని, అన్ని జలాశయాలు, చెరువులు నీటితో నింపడం జరుగుతుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.2.39 కోట్లు



హుండీ కానుకలను లెక్కిస్తున్న కాణిపాక ఆలయ సిబ్బంది

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడి ఆలయానికి హుండీ ద్వారా రూ.2.39,09,202 ఆదాయం లభించింది. శుక్రవారం ఆస్థాన మండపంలో ఈవో పెంచలకిషోర్ పర్యవేక్షణలో హుండీ కానుకలను ఆలయ సిబ్బంది లెక్కించారు. 54 గ్రాముల బంగారం, 1,910 గ్రాముల వెండితోపాటు 157 యూఎస్‌ఏ, 280 కెనడా, 20 ఆస్ట్రేలియా, 12 సింగపూర్ డాలర్లు, 15 ఇంగ్లాండ్ పౌండ్లు, 572 యూఏఈ దిర్హామ్స్, 5 యూరోలు, 52 మలేసియా రింగిట్స్ సమకూరినట్లు ఈవో తెలిపారు. దీంతోపాటు గోసంరక్షణ హుండీ ద్వారా రూ.29,485, నిత్యాన్నదాన భవనం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.67,339 లభించినట్లు వివరించారు. ఈ ఆదాయం 30 రోజుల్లో లభించినట్లు చెప్పారు. డీఈవో సాగర్‌బాబు, జిల్లా ఏసీ చిట్టెమ్మ, ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ప్రసాద్, ధనపాల్, సీఎఫ్‌వో నాగేశ్వరరావు, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, బాలరంగస్వామి పాల్గొన్నారు.

రైలు కిందపడ్డ స్నేహితులు

పూతలపట్టు యువకుడి మృతి, మరొకరి పరిస్థితి విషమం

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):హోటల్లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఇద్దరు యువకులు రైలు కిందపడి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది.పూతలపట్టుకు చెందిన జి.ఉమేష్‌చంద్ర(24), నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం తోడేరు పంచాయితీకి చెందిన పి.వంశీ నెల్లూరు నగరం హరనాథపురంలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. ఈనెల 17వ తేదీ రాత్రి వీరిద్దరూ బర్త్ డే పార్టీ అంటూ యజమాని వద్ద రూ.2 వేలు తీసుకుని బయటకు వచ్చారు. ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ గురువారం వెంకటేశ్వరపురం ఫ్లైవోవర్ బ్రిడ్జి సమీపంలో రైలు కిందపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న రైల్వే ఎస్‌ఐ ఎస్ హరిచందన సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సంఘటనా స్థలంలోనే ఉమేష్‌చంద్ర మృతి చెందగా, అపస్మారక స్థితిలో ఉన్న వంశీని చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వంశీ కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో వారు నెల్లూరుకు చేరుకొని మెరుగైన చికిత్స నిమిత్తం నారాయణ వైద్యశాలకు తరలించారు. ఉమేష్‌చంద్ర మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరిచందన తెలిపారు.

నేతమ్స్ షుగర్స్ చైర్మన్ అరెస్టు

నింద్ర/నగరి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నింద్ర మండల పరిధిలోని నేతమ్స్ చక్కెర కర్మాగార చైర్మన్ నందకుమార్‌ను నగరి పోలీసులు శుక్రవారం తిరుపతిలో అరెస్టు చేశారు.డీఎస్పీ అజీజ్, నగరి రూరల్ సీఐ భాస్కర్ కథనం మేరకు.... చెరకు తోలిన రైతులకు, కర్మాగార కార్మికులకు బకాయిలు చెల్లించకుండా నేతమ్స్ చక్కెర కర్మాగారాన్ని మూసివేయడంతో వారు కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు కేన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.రైతులకు రూ.37 కోట్లు, కార్మికులకు రూ.6 కోట్లు బకాయిలు చెల్లించాల్సి వుందని వివరించడంతో ఈ విషయంపై కేన్ కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు.ఈ నేపథ్యంలో శుక్రవారం తిరుపతిలో జరిగిన సౌత్ ఇండియా షుగర్ మిల్స్ అసోసియేషన్ సమావేశానికి నందకుమార్ హాజరైనట్లు పోలీసులకు సమాచారం అందింది.దీంతో శుక్రవారం రాత్రి నందకుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని న్యాయమూర్తి వద్ద హాజరుపరచగా రిమాండుకు ఆదేశించారు.

సర్పంచ్‌లకు గౌరవ వేతనం విడుదల

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఎన్నికలు జరిగిన 684 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు రెండో విడత కింద రూ.49,69,138 విడుదలైనట్లు డీపీవో సుధాకరరావు తెలిపారు. గౌరవ వేతనంగా ఒక్కో సర్పంచ్‌కు నెలకు రూ.3వేల వంతున విడుదల కాగా, ఈ మొత్తాన్ని త్వరలోనే వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నట్లు పేర్కొన్నారు.



టీటీడీకి విరాళంగా ఫాస్ట్‌ఫుడ్ వాహనం

తిరుమల, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): టీటీడీకి శుక్రవారం ఓ ఫాస్ట్‌ఫుడ్ వాహనం విరాళంగా అందింది. బెంగుళూరుకు చెందిన ఎంఎస్ రామయ్య విద్యాసంస్థలకు చెందిన ఎంఎస్ సుందర్ రామ్ రూ.14 లక్షల విలువైన వాహనాన్ని అందించారు. దీంతోపాటు టీటీడీ గోసంరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఆలయం ముందు వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి తాళాలను, విరాళం డీడీని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.



తిరుమలలో నటి ప్రేమ

తిరుమల శ్రీవారిని శుక్రవారం సినీనటి ప్రేమ, ఎమ్మెల్యే గుడెం మహిపాల్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు లడ్డూ ప్రసాదాలు అందించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.70 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,095

తలనీలాలు సమర్పించినవారు: 23,932



ఆరోగ్యవరప్రసాదినికి రూ.10 లక్షలు



తిరుమల, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన ఆదిత్య పొలెపల్లి అనే భక్తుడు టీటీడీ బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని పథకానికి రూ.10 లక్షలు విరాళంగా ఇచ్చారు. తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.

శ్రీసిటీని సందర్శించిన హెచ్‌సీసీ బృందం



ప్రసంగిస్తున్న నిరీషా సన్నారెడ్డి

సత్యవేడు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చెన్నై హిందుస్థాన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (హెచ్‌సీసీ)కు చెందిన 25 మంది ప్రతినిధుల బృందం (సీఐఐ) శుక్రవారం శ్రీసిటీని సందర్శించింది. ఇక్కడ వ్యాపార అనుకూల అవకాశాలు, పారిశ్రామిక సామర్థ్యాన్ని పరిశీలించింది. సంస్థ ఛైర్మన్ గోపినాథ్, వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ తాతియా నేతృత్వంలో విచ్చేసిన హెచ్‌సీసీ బృందానికి శ్రీసిటీ సీఎస్ఆర్ డైరెక్టర్ నిరీషారెడ్డి స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలను వివరించారు. శ్రీసిటీలో ప్రపంచస్థాయి మౌలిక వసతులు, వ్యూహాత్మక ప్రయోజనాలు, ఇతర ప్రత్యేకతలను శ్రీసిటీ ఆపరేషన్స్ ప్రెసిడెంట్ సతీష్ కామత్ వివరించారు. పర్యటనలో భాగంగా శ్రీసిటీ అధికారులతో చర్చల్లో పాల్గొన్న హెచ్‌సీసీ ప్రతినిధులు, వివిధ అంశాలపై నిశితంగా ఆరాతీసి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం డైకిన్, వరుణ్ బేవరేజెస్, ఎంఎస్ఆర్ గార్మెంట్స్ పరిశ్రమలను సందర్శించారు. కంపెనీల సాంకేతిక నైపుణ్యాలు, తయారీ విధానాలను పరిశీలించారు. సందర్శనకు సహకరించిన శ్రీసిటీ యాజమాన్యానికి గోపినాథ్, ప్రవీణ్ తాతియా కృతజ్ఞతలు తెలిపారు. శ్రీసిటీ ప్రణాళిక, పెట్టుబడి అనుకూల వాతావరణాన్ని కొనియాడారు. పారిశ్రామిక నగరంగా శ్రీసిటీ మరింత అభివృద్ధి సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఐఐటీలో నేడు రేపు కళా ఉత్సవం

ఏర్పేడు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి ఐఐటీలో ఈనెల 20, 21 తేదీల్లో తిరుపతికి చెందిన ఆర్టిస్టా క్లబ్ ఆధ్వర్యంలో కళాంగిని పేరుతో ప్రత్యేక కళా ఉత్సవం జరగనుంది. ఈ వేడుకల్లో తిరుపతికి చెందిన మహిళా కళాకారిణులు స్టీల్ ఆర్ట్, నిర్మల్ ఆర్ట్ వంటి సంప్రదాయ కళారూపాలను ప్రదర్శించనున్నారు. శనివారం ఉదయం 10గంటలకు ప్రారంభం కానున్న ఈ కళా ఉత్సవం ఆదివారం సాయంత్రం 5గంటలకు ముగుస్తుంది. శనివారం కళాఉత్సవం, వర్క్‌షాపులు, సీనరి పెయింటింగ్, ఫ్లోరల్ ఆర్ట్, పేపర్ డెకర్, పాట్ ఆడోర్నమెంట్ వంటివి నిర్వహించనున్నారు. అలాగే పెయింటింగ్‌పై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. 21న ఆదివారం ఆర్ట్ ఎగ్జిబిషన్ జరగనుంది. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ దివాకర్ రెడ్డి, టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్టు ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. సంప్రదాయ కళాఖండాలు, వర్క్‌షాపులతో ప్రత్యేక ప్రదర్శనలు చేపట్టనున్నారు.

ఎర్రచందనం స్మగ్లర్లకు మూడేళ్ల జైలు

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడి ఏడుగురు స్మగ్లర్లకు ఒక్కొక్కరికి మూడేళ్ల జైలు, తలా రూ.20 వేల చొప్పున జరిమానా విధిస్తూ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు నిచ్చారు. మండలంలోని కారణిమిట్టకు చెందిన సమ్మిటి పెద్దగురవయ్య, కారణి రామయ్య, పిగిలి మోహన్, పిగిలి వెంకటయ్య, చెరివి శ్రీనాథ్, చెరివి రమణయ్య, వెంకటగిరి మునిరత్నంలను ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో 2016లో అప్పటి ఎస్ఐ హేమంత్‌కుమార్‌రెడ్డి అరెస్టు చేశారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమరనారయణ సాక్ష్యధారాలను నిరూపించి నిందితులకు శిక్ష పడేలా చేశారు. శేషాచలం అడవుల్లో విలువైన సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడివిలోకి అక్రమంగా ప్రవేశించే నేరస్థులకు ఇది హెచ్చరిక అని తిరుపతి ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఈ సందర్భంగా హెచ్చరించారు. నిందితులకు శిక్షపడేలా సహకరించిన శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, బీఎన్‌కండ్రిగ సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడులను ఎస్పీ అభినందించారు.

రూ.13లక్షలు స్వాహా చేశారు

● ముగ్గురిపై సురేష్ ప్రొడక్షన్స్ మేనేజరు ఫిర్యాదు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సురేష్ ప్రొడక్షన్స్‌కు సంబంధించిన రూ.13 లక్షల నగదును స్వాహా చేసినట్లు ఆ సంస్థ మేనేజర్ నాయుడుపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పట్టణంలోని రెండు సినిమా హాళ్లను సురేష్ ప్రొడక్షన్స్ సంస్థ లీజుకు తీసుకొని నడుపుతోంది. ఆ సినిమా హాళ్ల నుంచి వచ్చిన నగదును సురేష్ ప్రొడక్షన్స్ ఉద్యోగి సాయి బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తూ ఉంటాడు. మూడు నెలలుగా తక్కువ నగదు డిపాజిట్ చేసి బ్యాంక్ ఇచ్చిన రశీదును మార్చి యాజమాన్యానికి పంపేవాడు. ఇటీవల సురేష్ ప్రొడక్షన్స్ ప్రధాన కార్యాలయం సిబ్బంది పరిశీలించగా సాయి రూ.10 లక్షలు స్వాహా చేసినట్లు, అక్కడే పనిచేస్తున్న బాషా, మాకాని సాయి కలిసి రూ.3 లక్షలు స్వాహా చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీఎం ప్రారంభించనున్న పీఏసీ5 భవనాన్ని పరిశీలించిన ఈవో

తిరుమల, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): తిరుమలలో నూతనంగా నిర్మించి ప్రారంబానికి సిద్ధంగా ఉన్న పీఏసీ-5(వేంకటాద్రి నిలయం)ను టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి శుక్రవారం పరిశీలించారు. 25న సీఎం చంద్రబాబు ఈ భవనాన్ని ప్రారంభిస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ యంత్రాన్ని అధికారులు పరిశీలించారు. ఈవోతో పాటు సీవీఎస్వో మురళికృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు, సీఈ సత్యనారాయణ ఉన్నారు.



మత్స్యకారుల్లో 'అల'జడి

● బతుకు నావకు కొరవడిన భద్రత

● ప్రమాద అంచున జెట్టి నిర్మాణం

● బోట్లు కొట్టుకుపోతాయని ఆందోళన





కోట మండలం గోవిందపల్లిపాళెం తీరం వద్ద జెట్టి ప్రమాదకరంగా ఉండటంతో ఒడ్డున నిలిపివేసి ఉన్న ఇంజన్ బోట్‌లు (ఫైబర్ బోట్) - గోవిందపల్లిపాళెం వద్ద స్వర్ణముఖి, చల్లకాలువ, బకింగ్‌హామ్ కెనాల్ కలిసేచోట నిర్మించి ఉన్న జెట్టి కోతకు గురై నీళ్లల్లో తేలుతున్న దృశ్యం

కోట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమ జీవనోపాధికి ఊతంగా నిలిచిన జెట్టి ప్రమాదపు అంచుకు చేరడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఏడెనిమిదేళ్లపాటు తమ బోట్ల భద్రతకు భరోసా ఇచ్చిన ఈ నిర్మాణం సాగరంలోకి కొట్టుకుపోతుందేనని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కొట మండలం కొత్తపట్నం పంచాయతీ పరిధిలో గోవిందపల్లిపాళెం, శ్రీనివాస సత్రం గ్రామాలున్నాయి. గోవిందపల్లిపాళెం తీరం నుంచి నిత్యం 200కు పైగా ఇంజన్‌బోట్లతో ఈగ్రామాల మత్స్యకారులు వేటకు వెళ్తుంటారు. అయితే వేట తర్వాత తీరం చేరిన పడవలకు రక్షణ కొరవడేది. మత్స్యకార గ్రామాల ఎగువభాగం నుంచి స్వర్ణముఖి, చల్లకాలువ నదులతోపాటు బకింగ్‌హామ్ కెనాల్ ఉధృతంగా ప్రవహిస్తూ గోవిందపల్లిపాళెం వద్ద బోట్లు, వలలతోపాటు వేట సామగ్రిని ముంచెత్తేది. ఆటుపోట్లు, అలజడులు, ప్రకృతి విపత్తులకు ఇంజన్‌బోట్లు సముద్రంలోకి కొట్టుకుపోయేవి. దీంతో తీవ్రంగా నష్టపోయిన మత్స్యకారులు తిరిగి కొనుక్కునే స్థోమతలేక వేటకు వెళ్లలేక వీధినపడేవారు.

పాశం చొరవతో జెట్టి నిర్మాణం

మత్స్యకారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని 2016లో అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ చొరవ తీసుకున్నారు. ఆర్ఐడీఎఫ్ కింద రూ.కోటి మంజూరు చేయించారు. ఈ నిధులతో ఇంజన్ బోట్ల రక్షణ కోసం గోవిందపల్లిపాళెం తీరంలో జెట్టిని నిర్మించారు. ఉధృత ప్రవాహాల నుంచి బోట్లు, వలలతో పాటు వేట సామగ్రి కొట్టుకు పోకుండా జెట్టి అడ్డుగోడగా నిలిచింది. ఫలితంగా మత్స్యకారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే గతేడాది వరద ఉధృతి జెట్టిని కూడా ముంచెత్తింది. దీంతో జెట్టి పూర్తిగా కోతకు గురైంది. నీటిమీద తేలియాడే పరిస్థితికి వచ్చింది. రక్షణ గోడలు, రింగ్‌బండ్‌లు లేకపోవడంతో చుట్టూ ఉప్పునీరు చేరి ఇది కూలిపోయే స్థితికి చేరింది.

అభద్రత తీరాన బోట్లు

ప్రమాదంలో పడిన జెట్టిపై నమ్మకంలేక మత్స్యకారులు విధిలేని పరిస్థితుల్లో తమ బతుకు ఆధారమైన బోట్లను తీరంవద్ద నిలిపేసి వెళ్తున్నారు. దేవుడి మీద భారం వేస్తున్నారు. ఏ క్షణం లోనైనా సాగరంలో తీవ్ర అలజడులు వచ్చినా, వరదనీరు ప్రవహించినా జెట్టి కొట్టుకుపోయేలా ఉందని వీరంతా ఆందోళన చెందుతున్నారు. తక్షణమే జెట్టికి మరమ్మతులు చేపట్టి తమ బోట్లకు భద్రత కల్పించాలని కోరుతున్నారు.

8 కిలోమీటర్లలోపే చేపల వేట



కార్యక్రమంలో మాట్లాడుతున్న మెరైన్ సీఐ వెంకటేశ్వర్లురెడ్డి

కోట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సముద్రతీరం నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరం లోపు వరకే చేపల వేట సాగించాలని మత్స్యకారులకు తహసీల్దారు జయజయరావు, మెరైన్ సీఐ వెంకటేశ్వర్లురెడ్డి సూచించారు. కోట మండలం గోవిందపల్లిపాళెం సముద్రతీరం వద్ద శుక్రవారం మత్స్యకారుల భద్రతపై మెరైన్, మత్స్యశాఖల ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో వీరు మాట్లాడారు. సముద్రంలోకి ఇతర ప్రాంతాల బోట్లు, అపరిచిత వ్యక్తుల సంచారం ఉంటే తక్షణమే సమాచారం ఇవ్వాలన్నారు. జెట్టి నిర్మాణ పనులకు రూ.60 లక్షలతో ప్రతిపాదనలు పంపామన్నారు. తుపాను షెల్టర్ల తాత్కాలిక మరమ్మతులకూ నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. అనంతరం గోవిందపల్లిపాళెం సముద్ర తీరంలో మత్స్యకారులతో కలసి అధికారులు విహరించారు. మెరైన్ ఎస్ఐలు నారాయణరెడ్డి, శివసౌమ్య, ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, ప్రవీణ్‌కుమార్, ఎఫ్‌డీవో రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా ఆపండి

● ట్రాక్టర్ కింద పడుకొని అడ్డుకున్న గ్రామస్తుడు



ట్రాక్టర్ కింద పడుకొన్న బాపూజీ

చంద్రగిరి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): 'ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నాం. వీటి జోరుకు ఇళ్లల్లోని పిల్లలు భయాందోళన చెందుతున్నారు' అంటూ చంద్రగిరి మండలం ఎగువ రెడ్డివారిపల్లెలో బాపూజీ అలియాస్ బాబ్జీ అడ్డుకున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఇసుక ట్రాక్టరు కింద పడుకున్నారు. తెల్లవారు జామున 3 గంటల సమయంలో స్వర్ణముఖినది నుంచి ఇసుకతో ఆయన ఇంటి ముందు ట్రాక్టరు వెళ్తుండగా అడ్డుకున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్ డ్రైవర్‌కి, బాపూజీకి కొంత వాగ్వాదం చోటుచేసుకొంది. శుక్రవారం ఉదయం కూడా యథావిధిగా ఇసుక ట్రాక్టర్లు తన ఇంటి ముందు పోతుండగా మళ్లీ బాపూజీ అడ్డుకున్నారు. దీంతో డ్రైవర్ దురుసుగా మాట్లాడారు. ఇసుక రవాణాకు ఎవరు అనుమతులు ఇచ్చారో చెప్పాలంటూ బాపూజీ డిమాండ్ చేశారు. తన ఇంటి ముందు ఇసుక ట్రాక్టర్ వెళ్లకూడదంటూ టైరు ముందు భాగంలో పడుకొన్నారు. ఎలా ట్రాక్టర్ నడుపుతావంటూ అడ్డుకున్నారు. అనంతరం డయల్ 100కి కాల్ చేయగా పోలీసులు ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై బాపూజీ పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారిస్తున్నారు.

టీడీపీలోకి ఎమ్మెల్సీ కళ్యాణ్ చక్రవర్తి



కళ్యాణ్‌చక్రవర్తిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబుతో ఎమ్మెల్యేలు నాని, సునీల్, విజయశ్రీ

తడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి టీడీపీలో చేరారు. అమరావతిలో శుక్రవారం ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబునాయుడును కలవగా, ఆయన పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కాగా, కళ్యాణ్‌చక్రవర్తి తండ్రి బల్లి దుర్గాప్రసాద్ 2019 ఎన్నికలకు ముందు వరకు టీడీపీలో ఉన్నారు. టీడీపీ నుంచి గూడూరు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశారు. 2019 ఎన్నికల సమయంలో టీడీపీని వీడి వైసీపీలో చేరి తిరుపతి ఎంపీగా గెలుపొందారు. 2020లో ఆయన మృతి చెందడంతో ఆయన కుమారుడైన బల్లి కళ్యాణ్ చక్రవర్తికి వైసీపీ ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది. 2024 ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమి తరువాత ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి తన పదవికి రాజీనామా చేస్తూ శాసన మండలి ఛైర్మన్‌కు సమర్పించారు. ఆ రాజీనామా ఇప్పటికీ పెండింగ్‌లో ఉంది. అప్పటి నుంచి ఆయన టీడీపీతో సఖ్యతగా ఉంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, సూళ్లూరుపేట, గూడూరు, చంద్రగిరి ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ, పాశం సునీల్‌కుమార్, పులిపర్తి నాని, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.

మహిళల కోసమే వైద్యశిబిరాలు



చంద్రగిరి సీహెచ్‌సీ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

చంద్రగిరి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్వస్త్ నారి సశక్త్ అభియాన్ (ఆరోగ్య వంతమైన మహిళ- శక్తిమంతమైన కుటుంబం) పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసమే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాయి. మహిళల ఆరోగ్యాన్ని కాపాడి కుటుంబాన్ని బలపరిచే లక్ష్యంతో ఈకార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బుధవారం ప్రారంభమైన ఈ వైద్య శిబిరాలను అక్టోబరు 2వ తేది వరకు రెండు వారాల పాటు నిర్వహించనున్నారు. ఈవైద్య శిబిరాలకు మహిళల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ శిబిరాల్లో మహిళలకు ఆరోగ్యంపై అవగాహన పెంచడం, వారికి సమయానుకూల వైద్య సేవలు అందించడం, పోషకాహారాన్ని ప్రోత్సహించడం, కుటుంబాలను స్వశక్తి చేసేలా చర్యలు చేపట్టారు. 'మహిళ ఆరోగ్యం బలపడితే కుటుంబం మొత్తం సంతోషంగా ఉంటుంది. తల్లి ఆరోగ్యంగా ఉంటే పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారు. మహిళా శక్తి సమాజ శక్తికి పునాది అవుతుంది' అనే నినాదంతో మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అన్ని గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో ప్రత్యేక వైద్య శిబిరాలలో వైద్య నిపుణులు, పారా మెడికల్ సిబ్బంది ద్వారా నిర్వహిస్తున్నారు.

శిబిరాల్లో అందించే వైద్య సేవలివీ

మహిళల్లో గుండె జబ్బులు, మధుమేహం, నోటి కాన్సర్, గర్భాశయ కాన్సర్‌కు పరీక్షల ద్వారా తగిన వైద్య చికిత్సలను, రెఫరల్ సేవలను అందిస్తున్నారు. మహిళలు, కిశోర బాలికలలో రక్తహీనతను గుర్తించడం, గర్భవతులను పరీక్షించి సరైన పోషకాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతపై కౌన్సెలింగ్ ఇస్తున్నారు. గర్భిణులకు ఎంసిపి కార్డులు అందజేస్తున్నారు. పిల్లలలో సికిల్ సెల్ అనీమియా గుర్తించి అవసరమైన వారికి చికిత్స చేస్తున్నారు. పిల్లలకు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు అందజేస్తారు. యుక్త వయస్సు బాలికలు, మహిళలకు బహిష్టు పరిశుభ్రత గురించి అవగాహన కల్పిస్తున్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించడం, ఆయుష్మాన్ ఆరోగ్య కార్డులు అందిస్తున్నారు. ఈ శిబిరాలను ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలని చంద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ సూచించారు. ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ ఆరోగ్య కార్డులకూ నమోదు చేసుకోవాలన్నారు.

చెంగాళమ్మ ఆలయంలో 22 నుంచి శరన్నవరాత్రి వేడుకలు



చెంగాళమ్మ

సూళ్లూరుపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2 వరకు శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరగనున్నాయి. 11 రోజులపాటు జరిగే ఉత్సవాల్లో అమ్మవారు ఒక్కోరోజు ఒక్కో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అలాగే రోజుకొక ప్రాంతం నుంచి సారె సమర్పించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను దేవదాయశాఖ అధికారులు చేస్తున్నారు. ఉత్సవాల్లో అమ్మవారు 22వ తేదీన పరమేశ్వరి అలంకారం, 23న గాయిత్రి, 24న అన్నపూర్ణ, 25న అష్టకాళి, 26న మహాలక్ష్మి, 27న బాలత్రిపుర సుందరి, 28న చండి, 29న సరస్వతి, 30న దుర్గాదేవి, 1న రాజరాజేశ్వరి, 2న మహిషాసురమర్ధిని అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ప్రతి రోజు ఆలయ ప్రాంగణంలో మహా చండీయాగం నిర్వహిస్తామని సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు.

క్రిప్టో కరెన్సీ పేరుతో రూ.13.5 లక్షల స్వాహా

తిరుచానూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): క్రిప్టో కరెన్సీతో భారీ ఆదాయం వస్తుందని నమ్మించి రూ.13.5లక్షలు కాజేసిన ఘటన తిరుచానూరులో శుక్రవారం చోటుచేసుకుంది. తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ తెలిపిన ప్రకారం.. తిరుచానూరు వసుంధరనగర్‌కు చెందిన హిమసాగర్ చిన్న ప్రైవేటు కంపెనీ నిర్వహిస్తున్నారు. అతడి తండ్రి టీటీడీ ఉద్యోగి. చైతన్యపురం గజలక్ష్మి గ్రీన్‌సిటీ వద్ద నివాసం ఉంటున్న ఉత్కర్ష్ రామాయణం హిమసాగర్‌కు స్నేహితుడు. క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే షేర్స్ తరహాలో భారీ ఆదాయం వస్తుందని హిమసాగర్‌ను నమ్మించాడు. ఉత్కర్ష్ రామయణం ఓ ఖాతా నెంబరు చెప్పి అందులో డబ్బు జమ చేయాలని సూచించాడు. హిమసాగర్ రూ.13.50 లక్షలు సదరు ఖాతాకు జమ చేశారు. నెల రోజులైనా డబ్బు తిరిగి రాకపోవడంతో హిమసాగర్ ఉత్కర్ష్ రామాయణాన్ని నిలదీశారు. తనకు సంబంధం లేదని చెప్పడంతో బాధితుడు శుక్రవారం రాత్రి తిరుచానూరు పోలీసులను ఆశ్రయించారు. ఉత్కర్ష్ రామాయణంపై చీటింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. క్రిప్టో కరెన్సీ, షేర్ మార్కెట్స్, బిట్‌కాయిన్స్‌తో అధిక లాభాలు వస్తాయని చెప్పే మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు.

నేడు తిరుపతి కలెక్టర్‌కు స్కోచ్ పురస్కారం

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వెంకటేశ్వర్ ఢిల్లీలో శనివారం స్కోచ్ పురస్కారం అందుకోనున్నారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి న్యూఢిల్లీకి చెందిన స్కోచ్ సంస్థ ఏటా పురస్కారాలు అందజేస్తోంది. చంద్రగిరి నియోజకవర్గం స్వర్ణనారావారిపల్లె కింద సి.రామాపురం, కందులవారిపల్లె, రంగంపేట పంచాయతీల్లో 45 రోజుల్లో 1,600 గృహాలకు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసినందుకు గాను కలెక్టర్ ఈ పురస్కారం అందుకోనున్నారు.

30 కిలోల గంజాయి స్వాధీనం : నలుగురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు గంజాయి తరలిస్తున్న నలుగురిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుంచి 30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు... ఒడిశా రాష్ట్రం రానాలి గ్రామానికి చెందిన డోస్ చాందిని, దానుపాణి, జోసెఫ్ బర్దాన్ తిరుపతిని కేంద్రంగా చేసుకుని గంజాయి వ్యాపారం సాగిస్తున్నారు. ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి తమిళనాడులోని స్మగ్లర్లకు విక్రయిస్తున్నారు. శుక్రవారం అందిన రహస్య సమాచారం మేరకు రామతులసి కల్యాణ మండపం వద్ద తమిళనాడు తిరునల్వేలి జిల్లా కొక్కిరాకులం గ్రామానికి చెందిన ఎం.ముత్తువేలు గంజాయి తీసుకెళుతుండగా ఈస్ట్ సీఐ శ్రీనివాసులు సిబ్బందితో కలసి పట్టుకున్నారు. అతను ఇచ్చిన సమాచారం మేరకు ఒడిశాకు చెందిన డోస్ చాందిని, దానుపాణి, జోసెఫ్ బర్దాన్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

తైక్వాండో కోచ్ గోపీనాయుడికి అవార్డు



గోపినాయుడికి అవార్డు, ట్రోఫీ అందజేస్తున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):కేంద్ర మంత్రిత్వ శాఖ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజస్ సంస్థ తిరుపతికి చెందిన తైక్వాండో కోచ్ గోపినాయుడికి ప్రతిష్టాత్మక సుభాష్‌చంద్రబోస్ ఐకాన్ అవార్డు ప్రదానం చేసింది. టీటీడీ విద్యాసంస్థలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డు అందించింది.శుక్రవారం సాయంత్రం ఆయన టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆయన చేతుల మీదుగా అవార్డు, జ్ఞాపికను అందుకున్నారు.

నేడు అపోలో కళాశాలలో స్టాంపుల ప్రదర్శన

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మురకంబట్టులోని అపోలో కళాశాలలో శనివారం స్టాంపుల మహోత్సవం నిర్వహించనున్నట్లు కో-ఆర్డినేటర్ కీర్తన తెలిపారు. ఈ సందర్భంగా అరుదైన స్టాంపుల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎం, డిప్యూటీ సీఎంలను కలసిన థామస్

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి



వెదురుకుప్పం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీడీనెల్లూరు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను వేర్వేరుగా రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్ కలిసి విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని సీఎంను కోరడంతో పాటు పరిశ్రమల స్థాపనకు ప్రతిపాదనలను సమర్పించారు. త్వరలోనే గంగాధరనెల్లూరు నియోజకవర్గాన్ని ఐటీ హబ్‌గా మార్చే దిశగా చర్యలు ప్రారంభమవుతాయని థామస్ శుక్రవారం తెలిపారు. అలాగే డిప్యూటీ సీఎంను కలసి పంచాయతీరాజ్‌శాఖ ద్వారా నూతన రోడ్లు, రోడ్ల మరమ్మతులకు నిధులు ఇవ్వాలని కోరారు. పవన్‌కల్యాణ్ సానుకూలంగా స్పందించారని ప్రభుత్వ విప్ తెలిపారు. సీఎం, డిప్యూటీ సీఎంలు ప్రత్యేక దృష్టి సారిస్తే గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని మండలాల్లో అభివృద్ధి పరుగులు తీయనున్నాయి.

మాతాశిశు మరణాలు జరుగుతుంటే ఏం చేస్తున్నారు?

● పీహెచ్‌సీ వైద్యాధికారులపై డీఎంహెచ్‌వో ఆగ్రహం



వైద్యాధికారులను విచారిస్తున్న టాస్క్‌ఫోర్స్ కమిటీ

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒక్క నెలలోనే ఎనిమిది మాతాశిశు మరణాలు జరిగితే ఏంచేస్తున్నారని పీహెచ్‌సీ వైద్యాధికారులపై డీఎంహెచ్‌వో సుధారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో జిల్లా మాతాశిశు మరణాల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆగస్టులో ఒక మాత, ఏడు శిశు మరణాలు సంభవించడం దారుణమన్నారు. ఈ మరణాలకు కారణాలపై ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బందిని విచారించారు. ఈ మరణాలకు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కూడా కారణంగా తెలుస్తోందని కమిటీ సభ్యులు తెలిపారు. ఇకపై మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో డీసీహెచ్‌ఎస్ పద్మాంజలిదేవి, డీఐవో హనుమంతరావు, చిత్తూరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ఉషశ్రీ, గైనకాలజిస్టులు లత, ప్రశాంతి, సునంద తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను మ్యాపింగ్ చేయండి

● ఎన్నికల కమిషన్ జాయింట్ సీఈవో సూచన

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు సంబంధించిన 2025 సంవత్సర ఓటరు జాబితాను ఈనెల 26వ తేదీలోగా మ్యాపింగ్ చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ జాయింట్ సీఈవో వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం అమరావతి నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు జాబితా పరిశీలన ప్రక్రియలో నిర్లక్ష్యం తగదని చెప్పారు. చిత్తూరు కలెక్టరేట్ నుంచి పాల్గొన్న డీఆర్వో మోహన్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో చేపట్టిన ఓటరు జాబితా వివరాలను వివరించారు. నగరి, చిత్తూరు, పూతలపట్టు, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల ఈఆర్వోలు పాల్గొన్నారు.

ఈసీ ఆదేశాల మేరకే పనిచేయాలి: డీఆర్వో



డీఆర్వో మోహన్ కుమార్

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల సమయంలో ప్రతి ఉద్యోగి ఎన్నికల కమిషన్ (ఈసీ) ఆదేశాల మేరకే పనిచేయాలని డీఆర్వో మోహన్ కుమార్ సూచించారు. శుక్రవారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో చిత్తూరు, నగరి, పూతలపట్టు, జీడీనెల్లూరు నియోజకవర్గాల ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఓటరు సమగ్ర సవరణ ప్రక్రియను అమలు చేసే పనిలో కేంద్ర ఎన్నికల సంఘం ఉందన్నారు. ఓటరు జాబితాలో మార్పుచేర్పులు, తొలగింపులపై క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు పర్యటించి పక్కా సమాచారాన్ని సేకరించాలన్నారు. నగరి, చిత్తూరు ఆర్డీవోలు అనుపమ, శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, నగరపాలక కమిషనర్ నరసింహప్రసాద్, తహసీల్దార్ కులశేఖర్ పాల్గొన్నారు.

పీఎం ఎఫ్‌ఎంఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

- డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి



చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకాన్ని (పీఎం ఎఫ్‌ఎంఈ) మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి సూచించారు. శుక్రవారం స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతు సంఘాల సభ్యులతో వ్యవసాయ ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ.. పథకాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. టమోటా, మామిడి, బెల్లం, జామ తదితర ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే వీలుందన్నారు. పెట్టుబడి యూనిట్‌లో లబ్ధిదారుడి వాటా 10 శాతం కాగా, 90 శాతం రుణ సౌకర్యంతో పాటు 35 శాతం సబ్సిడీ రూపంలో వస్తుందని చెప్పారు. ఉద్యానశాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఫుడ్ ప్రాసెసింగ్‌కు జిల్లాలో అనువైన వాతావరణం ఉందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రతినిధి మ్యాథ్యూస్, డీపీఎం రవికుమార్, ఏపీఎం మధు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో కుండపోత
పిడుగుపాటుకు ఒకరి మృతి



తిరుపతి అర్బన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉపరితల ద్రోణి ప్రభావంతో తిరుపతిలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వాన పడింది. వీధులన్నీ నదులను తలపించాయి. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు.కాగా నాయుడుపేట మండలం కలిపేడు పంచాయతీ గంగమ్మకట్ట కాలనీకి చెందిన శివయ్య(22) పిడుగుపడి మృతి చెందారు. శుక్రవారం సాయంత్రం వ్యవసాయ పనులు చేస్తుండగా పిడుగుపడడంతో అక్కడిక్కడే చనిపోయారు.

అనాథల ఆత్మబంధువు

● ఎవరూలేని 16మందికి అంత్యక్రియలు ● ప్రశంసలందుకుంటున్న ఏఎస్ఐ సేవలు



వృద్ధురాలి మృతదేహానికి పూజలు



చావుబతుకుల మధ్య ఉన్న వ్యక్తికి సపర్యలు

పుంగనూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):అనాథ మృతదేహం ఉన్నట్లు సమాచారం అందితే చాలు..తానున్నానంటూ పుంగనూరు ఏఎస్ఐ అశ్వర్థనారాయణ వెనకాముందు ఆలోచించకుండా అన్నీ తానై దగ్గరుండి అంత్యక్రియలు చేస్తున్నారు. అంతేకాకుండా దిక్కులేకుండా పడివున్న అనాథలకు సపర్యలు చేస్తున్నారు. ఆస్పత్రుల్లో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. వి.కోట మండలం కమ్మేపల్లెకు చెందిన హెచ్. అశ్వర్థ నారాయణ పుంగనూరు పోలీస్ స్టేషన్‌కు 8 నెలల క్రితం ఏఎస్ఐగా బదిలీపై వచ్చారు.బీకాం, ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన అశ్వర్థ నారాయణ 1990లో పోలీసుశాఖలో చేరారు. పలమనేరు, తిరుపతి, శ్రీకాళహస్తి, కుప్పం, బైరెడ్డిపల్లె, గంగవరం స్టేషన్లలో పనిచేశారు. ఆయనకు భార్య మాధవి, ఇద్దరు కుమారులు వున్నారు.వారిలో హేమేష్ బెంగళూరులో డాక్టరుగా పనిచేస్తుండగా జశ్వంత్ బీటెక్ పూర్తి చేశాడు.

2002నుంచి అనాథలకు అండగా...

2002లో పలమనేరులో అశ్వర్థ నారాయణ పని చేస్తున్న సమయంలో ఓ అనాథ నీటిలో పడి చనిపోయాడు. అతడి కోసం ఎవరూ రాకపోవడంతో ఆవేదనకు గురైన అశ్వర్థనారాయణ సొంత డబ్బుతో అంత్యక్రియలు నిర్వహించారు. పలమనేరు, గంగవరం హైవేలో జరిగే రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులు రక్తపుమడుగులో ఉన్నా వాహనదారులు సహకరించకపోవడం గమనించిన ఆయన బాధితులకు అండగా నిలిచేవారు. యాచకులు, అనాథలు చనిపోతే మృతదేహాలను శ్మశానాలకు తీసుకెళ్లి పారిశుధ్య కార్మికులతో కలిసి అంత్యక్రియలు చేసేవారు. కర్ణాటక రాష్ట్రం ముళబాగల్‌కు చెందిన లోకేశ్ (50) ఒకటిన్నర సంవత్సరంగా పుంగనూరులో భిక్షాటనతో జీవనం సాగిస్తూ స్థానిక బీఎంఎస్‌క్లబ్ వద్ద ఉండేవాడు. రెండు వారాల క్రితం దీనస్థితిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న విషయం తెలుసుకున్న ఏఎస్ఐ అక్కడికి చేరుకుని చలించిపోయాడు. దుర్వాసన వస్తున్నా.. ఆయన ముఖం శుభ్రం చేసి వేరే దుస్తులు తెప్పించి మలమూత్రాలున్న బట్టలు ఆయనే తీసి మార్చారు. స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యులతో మాట్లాడి చికిత్సలందేలా చూశారు. మరుసటి రోజు ఆయన మాట్లాడే స్థితికి వచ్చి ఏఎస్ఐకి కృతజ్ఞతలు తెలిపారు. ఆ లోకేశ్ గత శనివారం మృతి చెందినట్లు తెలుసుకుని పుంగమ్మ చెరువు శ్మశానంలో అంత్యక్రియలు చేశారు. ఇటీవల సంతగేటు షాపింగ్ కాంప్లెక్స్‌లో అనాథ వృద్ధురాలు, అంబేడ్కర్ ప్రజాభవన్ వద్ద పేపర్లు ఏరుకుని జీవించే మరో అనాథ శవాలకు తన సొంత ఖర్చులతో అంత్యక్రియలు నిర్వహించారు.అనాథలకు అండగా నిలుస్తూ పుంగనూరు ప్రజల మన్ననలు పొందుతున్నారు.



అనాథ శవాన్ని పూడ్చేందుకు కార్మికులతో కలిసి గుంతలోకి దించుతూ....

అనాథలను ఆదుకోవడంలో సంతృప్తి



దిక్కూమొక్కులేని అనాథలను ఆదుకుంటే లభించే సంతృప్తే వేరు.అనాథల ప్రాణం పోగానే అంత్యక్రియలు చేయకుండా కుంటల్లో, చెరువుల్లో వేయడం, పూడ్చడం మంచిది కాదు. అలాంటి వారికి అంత్యక్రియలు చేయడం ఎంతో సంతృప్తినిస్తుంది. పలమనేరు సబ్‌జైల్లో ఓ హత్యకేసు ఖైదీ 1995లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. గమనించి ఆస్పత్రికి తీసుకెళ్లడంతో బతికాడు. అప్పట్లో డీజీపీ నుంచి రూ.500 రివార్డు లభించడం సంతోషమన్పించింది.

- అశ్వర్థ నారాయణ

ప్రేమ జంటలే టార్గెట్

● బెదిరించి నగలు, నగదు చోరీ ● దొంగను కటకటాల్లోకి నెట్టిన పోలీసులు



స్వాధీనం చేసుకున్న బంగారు చైన్లు

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రేమ జంటలనే టార్గెట్‌గా చేసుకుని బెదిరించి నగలు, నగదు చోరీ చేసే దొంగను పట్టుకుని, కటకటాల్లోకి నెట్టారు. అతడి వద్ద నుంచి రెండు లక్షల విలువైన బంగారు చైను, నగదును, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలను చిత్తూరు ఒకటో పట్టణ సీఐ మహేశ్వర ఏఎస్ఐ మధుకుమార్‌తో కలిసి మీడియాకు తెలిపారు. ఇటీవల కాలంలో చిత్తూరు నగర శివారు ప్రాంతాలు, జన సంచారం తక్కువగా ఉన్నచోట్ల ప్రేమ జంటలను ఓ వ్యక్తి బెదిరించి.. బంగారు చైన్లు, నగదు చోరీలు చేయడం మొదలుపెట్టాడు. దీనిపై ఓ ప్రేమ జంట ఇచ్చిన ఫిర్యాదుతో ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాలతో ప్రత్యేక బృందాలు దొంగను పట్టుకోవడానికి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం పీవీకేఎన్ కాలేజీ వెనుక వైపున ఉన్న అటవీ ప్రాంతంలో కొంగారెడ్డిపల్లెకు చెందిన రమేష్ కుమారుడు అఖిల్(30) ఒంటరిగా తిరుగుతుండగా పోలీసులకు అనుమానం వచ్చి పట్టుకున్నారు. విచారణలో నేరాన్ని ఒప్పుకోవడంతో అతడి వద్ద నుంచి రూ.1.20 లక్షల విలువ చేసే 12 గ్రాముల చైన్లు, నేరానికి ఉపయోగించిన రూ.80వేల ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న సీఐ మహేశ్వర

లారీకి బ్రేకులు ఫెయిలై
మొగిలి ఘాట్‌లో ప్రమాదం

● డ్రైవర్ మృతి, క్లీనర్‌కు స్వల్పగాయాలు



క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను వెలుపలకు తీస్తున్న స్థానికులు, పోలీసులు

బంగారుపాళ్యం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): లారీకి బ్రేకులు ఫెయిలై.. మొగిలి ఘాట్‌లో జరిగిన ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందాడు. క్లీనర్‌కు స్వల్పగాయాలయ్యాయి. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరు నుంచి ఫీడ్ లోడుతో తూర్పుగోదావరికి చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై లారీ ఒకటి వెళుతోంది. మార్గమధ్యంలో శుక్రవారం ఉదయం బంగారుపాళ్యం మండలంలోని మొగిలి ఘాట్‌లోకి వచ్చేసరికి ఆ లారీకి బ్రేకులు ఫెయిలయ్యాయి. ఈ క్రమంలో ముందు వెళుతున్న మరో లారీని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనం ముందు భాగం నుజ్జునుజ్జవడంతో లారీడ్రైవర్ సూర్యచంద్ర(46) క్యాబిన్‌లో ఇరుక్కుని తీవ్రంగా గాయపడ్డాడు. క్లీనర్ అయ్యన్న కిందకు దూకేయడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను పోలీసులు, స్థానికులు అతికష్టంపై బయటకు తీసి బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్పీడ్ బ్రేకర్ల వల్లేనా?

మొగిలి ఘాట్‌లో ఎక్కువ ప్రమాదాలు జరగడానికి కారణం స్పీడ్ బ్రేకర్లేనని భారీ వాహన డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. పలమనేరు జగమర్ల నుంచి మొగిలి వరకు రోడ్డు చాలా ఏటవాలుగా ఉంటుంది. వాహనాలు వేగంగా వస్తుంటాయి. దాంతో అధికారులు సుమారు రెండు కిలోమీటర్ల మేర అక్కడక్కడా స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేశారు. వీటి వద్ద భారీ లోడుతో వస్తున్న వాహనాలు అదుపుచేయడానికి బ్రేక్‌లను డ్రైవర్లు పదేపదే వేయాల్సి వస్తోంది. ఈ కారణంగా వాహనంలోని బ్రేక్‌కు సంబంధించిన వ్యాక్యూమ్ తగ్గిపోవడంతో భారీ వాహనాలు అదుపుచేయడానికి బ్రేక్‌లు వేసినా ఫెయిలై ప్రమాదాలు జరుగుతున్నాయని డ్రైవర్లు చెబుతున్నారు. ఈ స్పీడ్ బ్రేకర్లను అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆస్పత్రిలో మృతి చెందిన సూర్యచంద్ర

వరసిద్ధుడి ఆలయ భద్రత మనందరి బాధ్యత: ఈవో

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయ భద్రత మనందరి బాధ్యత అని ఈవో పెంచలకిషోర్ తెలిపారు. శుక్రవారం ఆలయ సమావేశ మందిరంలో ఆక్టోపస్ ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. దేశం ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఆలయాలకు ఉగ్రదాడి పొంచి ఉందని చెప్పారు. ఆలయం వద్ద ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు. అలాగే అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వాటిని ముట్టుకోకుండా అధికారులకు తెలియజేయాలని కోరారు. దేశ రక్షణ ఎంత ముఖ్యమో ఆలయాల పరిరక్షణ అంతే ముఖ్యమన్నారు. భక్తుల వేషధారణలో ఉగ్రవాదులు ఆలయంలోకి ప్రవేశించే అవకాశం ఉందని చెప్పారు. ప్రతి ఒక్క భక్తుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, సీఐ శ్రీధర్‌నాయుడు, తహసీల్దార్ లోకేశ్వరి, ఈఈ వెంకటనారాయణ, ఏఈవో రవీంద్రబాబు, ఏఈలు శివాంజనేయులు, పవన్, కాణిపాకం ఎస్ఐ నరసింహులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఈవో పెంచలకిషోర్

కల్లూరులో ఏనుగుల గుంపు హల్‌చల్

● దేవళంపేట వద్ద పంటల ధ్వంసం



కల్లూరు సమీపంలో హైవేను దాటుతున్న ఏనుగులు

కల్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు ఆగడంలేదు. మండలంలోని దేవళంపేట పంచాయతీలో గురువారం రాత్రి పంటలపై ఏనుగుల గుంపు దాడులు చేయడంతో పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. ముందుగా తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి 12 ఏనుగుల గుంపు కుమ్మరిపల్లి వద్దకు చేరుకున్నాయి. అక్కడి నుంచి కల్లూరు-పులిచెర్ల రోడ్డును దాటుకున్న ఏనుగుల గుంపు సచివాలయం మీదుగా చిన్ననగరి సమీపంలోని గోదాడుఒడ్డు వద్ద ఉన్న కలబందలను తిన్నాయి. సమీపంలో మిట్టమీదరాచపల్లిలోని జగన్మోహన్‌రెడ్డికి చెందిన టమోటా పంటను ఏనుగులు ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి దేవళంపేటలోని సుధాకర్, ప్రభాకర్‌లకు చెందిన టమోటా పంటను నాశనం చేశాయి. గురుస్వామికి చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. అక్కడి నుంచి దిగుమూర్తివారిపల్లి మీదుగా తూర్పు విభాగం అడవిలోకి సూరప్పచెరువు వద్దకు చేరుకున్నాయి. అంతకు ముందు గురువారం రాత్రి పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని పెద్దవంక నుంచి బయలుదేరిన 4 ఏనుగుల గుంపు రిలయన్స్ టవర్ వద్దకు చేరుకున్నాయి. అక్కడి నుంచి రాత్రి సుమారు 11 గంటల సమయంలో కల్లూరు సమీపంలోని ఎస్సార్ పెట్రోల్ బంకు వద్ద చిత్తూరు-కర్నూలు హైవే రోడ్డు సమీపానికి చేరుకున్నాయి. వాహనాలు రోడ్డుపై వెళుతుండగా అందులోని మూడు ఏనుగులు హైవే రోడ్డుపైకి చేరుకొని హల్‌చల్ చేశాయి. మూడు ఏనుగులు మాత్రం హైవే రోడ్డును దాటుకొని పాళెం పంచాయతీలోకి చేరుకోగా ఒక ఏనుగు మాత్రం రోడ్డును దాటుకోకుండా అటు నుంచి అటే వెనక్కు వెళ్లిపోయింది. రహదారిపై వెళ్లే వాహనదారులు రోడ్డు దాటుతున్న ఏనుగులను గమనించి ఎక్కడికక్కడ తమ వాహనాలను ఆపుకోవడంతో ఏనుగులు ఎలాంటి ఇబ్బంది పడకుండా రోడ్డును దాటుకున్నాయి. రోడ్డును దాటుకున్న మూడు ఏనుగుల గుంపు కోటపల్లి, జూపల్లి మార్గంలో మామిడిచెట్ల కొమ్మలను విరుచుకుంటూ సూరప్పచెరువు వద్దకు చేరుకున్నాయి. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సూరప్పచెరువు సమీపంలో సంచరిస్తున్న ఏనుగుల జాడను అటవీశాఖ సిబ్బంది పరిశీలించారు.

కుప్పంలో ఆధునిక ఆటోనగర్‌కు చర్యలు



స్థల పరిశీలన చేస్తున్న ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ తదితరులు

కుప్పం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని అసంఘటిత కార్మికులకు భవిష్యత్తు అవసరాలకు సైతం ఉపయోగపడేలా అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ప్రత్యేకమైన ఆటో నగర్‌ను ఏర్పాటు చేస్తామని ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్‌లతో కలిసి శుక్రవారం ఆయన ఆటోనగర్ నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక నాయకులు, కడా అధికారులు, ప్రజా ప్రతినిధులందరితో చర్చించి ఆటోనగర్ నిర్మాణానికి ఒక రూపు ఇస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే ఆటో నగర్ ఏర్పాటుకు అవసరమైన పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు శివకుమార్, రమణ, హరి యాదవ్, ఇస్మాయిల్, అబ్దుల్ మునాఫ్, సర్వేయర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేతో యాజమాన్య ధ్రువపత్రాలు



స్వామిత్వ సర్వే చేస్తున్న అధికారులు

పెద్దపంజాణి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లకు, ఖాళీ స్థలాలకు ఏళ్ల తరబడి రికార్డులు లేక ఇబ్బందులు పడుతున్నందున ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా స్వామిత్వ సర్వే ప్రారంభించిందని ఎంపీడీవో బాలాజీ తెలిపారు. శుక్రవారం మండలంలోని భద్రాచలం గ్రామంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులకు సర్వేపై అవగాహన కల్పించారు. గ్రామకంఠం భూముల్లో ఏళ్ల తరబడి నివాసముంటున్నా ఎటువంటి హక్కు పత్రాలు లేక ఇబ్బందులు పడుతున్నందున ప్రభుత్వం గుర్తించి వారు నివాసముంటున్న స్థలానికి యాజమాన్యపు ధ్రువపత్రాలు మంజూరు చేయడం కోసం ఈ సర్వే జరుగుతోందన్నారు. ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈవోపీఆర్డీ శారదాదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరుల నిరసన



పలమనేరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దస్తావేజుల లేఖర్లు

పలమనేరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శుక్రవారం దస్తావేజు లేఖర్లు తమ సమస్యలపై నిరసన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన విధానాలతో దస్తావేజు తయారీ ఇబ్బందిగా మారిందని వాపోయారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు

పలమనేరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలను పరిశీలించారు. బాలాజీ ట్రేడర్స్‌లో అనుమతి లేకుండా విక్రయానికి తెప్పించిన ఎరువులను తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు విక్రయించరాదని దుకాణ యజమానికి అధికారులు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ మల్లికార్జునరావు, ఏవో రామాంజనేయరెడ్డి, ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఏవో శాఖ అధికారిణి సంధ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అక్కదేవతలకు పూజలు



భక్తులకు ప్రసాదాలు పంపిణీ

సోమల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సోమల పంచాయతీ బుంగావారిపల్లెలోని శెట్టివారి పొలాల వద్ద కొలువుదీరిన అక్కదేవతల ఆలయం వద్ద శుక్రవారం పచ్చదేవర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈక్రమంలోనే పలువురు కోర్కెలు తీరిన భక్తులు అక్కదేవతల ఆలయం వద్దకు గుర్రపు వాహనాలను (వాభనాలను) ఉపవాస దీక్షలతో ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయం వద్ద ప్రతిష్ఠించారు. అక్కదేవతల ఆలయంలో పూజలు చేపట్టారు. శెట్టివారి సదాశివయ్య భక్తులకు అన్నదానం, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సోమల, అడుసుపల్లె, గుంతచెరువుపల్లె గ్రామాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు

సోమల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని, అప్పుడే కుటుంబం బాగుంటుందని సోమల ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు అన్నారు. శుక్రవారం సోమల పంచాయతీ దిడ్డివారిపల్లె సచివాలయం వద్ద నిర్వహించిన స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులచే గర్భిణులకు పౌషికాహారం ప్రాముఖ్యతను తెలియజేసి నిత్యం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రభాకర్, వైద్యాధికారులు డాక్టర్ జయసింహ, ప్రదీప్ కుమార్‌రెడ్డి, సీహెచ్‌వో అమరనాథ్, మహేంద్రబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హరిత, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజయోగ సాధనతో మానసిక ప్రశాంతత



సమావేశంలో మాట్లాడుతున్న మంజుదీదీ

పుంగనూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజయోగ సాధనతో మనిషిలోని చెడు ఆలోచనలు తొలగి ఆత్మచింతనతో మానసిక ప్రశాంతత పొందవచ్చని రాజస్థాన్‌కు చెందిన రాజయోగిని, మోటివేషన్ స్పీకర్ మంజుదీదీ అన్నారు. శుక్రవారం స్థానిక వాసవీ కల్యాణ మండపంలో స్వీయ పరివర్తన-ప్రశాంత జీవితం కార్యక్రమంపై బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు శిక్షణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వమానసిక శారీరక రుగ్మతలకు , మనోవైజ్ఞానిక మానసిక చికిత్సలకు ఒక దివ్య ఔషధంగా రాజయోగ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో బెంగళూరు లీలాదీదీ, నిర్మలదీదీ, రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన బ్రహ్మకుమారీస్ సిస్టర్లు బి.కె. శివమ్మ, హారతి, అరుణ, శివకుమార్, వాసు తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణ మండపానికి విరాళం



బుంగావారిపల్లెలో విరాళం అందజేస్తున్న దాతలు

సోమల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సోమల శివాలయం ఆవరణలో నిర్మాణంలో ఉన్న శివపార్వతుల కల్యాణ మండపానికి పలువురు దాతలు విరాళం అందజేసినట్లు ఆలయ ధర్మకర్త సోమశేఖర్ తెలిపారు. శుక్రవారం బుంగావారిపల్లెకు చెందిన శెట్టివారి రామప్ప జ్ఞాపకార్థం ఆయన కుమారులు సదాశివయ్య, రామ్మోహన్, భాస్కర్, దామోదరం రూ.25,116 విరాళం అందించారు. అలాగే రాశెట్టి వెంకటరమణ , శివరత్నమ్మ (ఎంఈవో) దంపతులు రూ.10,116 ఇచ్చారు. కార్యక్రమంలో టీచర్ విజయలక్ష్మీ, కామిశెట్టి నగేశ్, మహేంద్రబాబు, సీజీ రెడ్డెప్ప, మల్లికార్జున, లింగయ్య, రామూర్తి, గన్నా లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



అలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి రాహుకాలంలో వేదపండితులు పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాలతో అభిషేకాలు చేపట్టారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

కుప్పం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సాయిమాతా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి వారిచే ఆదివారం ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు జగదీశ్‌బాబు తెలిపారు. కుప్పం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 9 గంటలకు జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేస్తామన్నారు. ఇలా ఎంపిక చేసిన వారికి బెంగళూరు శంకర కంటి ఆస్పత్రిలో ఆపరేషన్లు చేస్తారన్నారు. ఉచిత ఆపరేషన్‌తోపాటు భోజనం, వసతి, ప్రయాణ సదుపాయాలన్నీ ఉచితంగానే అందిస్తామని చెప్పారు. నియోజకవర్గంలోని కంటి రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు రామకుప్పంలో..

రామకుప్పం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుప్పం పీఈఎస్ వైద్యకళాశాల ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం రామకుప్పంలో ఎన్టీఆర్ వైద్యసేవ ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ పెద్దలు సీతాపతి తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించే ఈ శిబిరంలో నిపుణులైన వైద్యులచే కంటి పరీక్షలు నిర్వహించి చికిత్సలందిస్తారన్నారు. శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరు, ఆరోగ్య శ్రీకార్డులను తమ వెంట తీసుకురావాలని ఆయన కోరారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



శిబిరంలో మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ వెంకటరమణ

సదుం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సమగ్ర శిక్ష తో ప్రభుత్వం అందించే పథకాలను పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సహిత విద్య జిల్లా అడిషనల్ కో-ఆర్డినేటర్ వెంకటరమణ సూచించారు. శుక్రవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పుంగనూరు నియోజకవర్గం ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో చౌడేపల్లె, సోమల, రొంపిచెర్ల, సదుం, పులిచెర్ల మండలాల ఎంఈవోలు, వైద్య బృందం, సహిత విద్య సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ మండలాధ్యక్షుడికి ఘన సన్మానం



ఉదయ్ కుమార్‌ను సన్మానిస్తున్న టీడీపీ శ్రేణులు

శాంతిపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిగం ఉదయ్‌కుమార్ నాయుడుకు సంతూరు గ్రామంలో శుక్రవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. మండల పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన ఉదయ్ కుమార్‌ను సంతూరు గ్రామంలో పర్యటించారు. గ్రామ దేవత గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శాంతిపురం క్లస్టర్ ఇన్‌చార్జి రాజేంద్ర, యూనిట్ ఇన్‌చార్జి ఆంజనేయరెడ్డి, గిరిధర్, మండల వాణిజ్య విభాగం అధ్యక్షులు మురళీ నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థిని తల పగులగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

పుంగనూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు భాష్యం పాఠశాలలో విద్యార్థిని సాత్విక నాగశ్రీని కొట్టిన హిందీ టీచర్ సలీంబాషా, ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి ఐక్యవేదిక సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ రాముకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువు చెప్పకుండా వారిని కొట్టడం, మానసికంగా హింసించడం, శారీరక శిక్షలు సరికాదన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లఘించిన ప్రైవేటు పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, సురేశ్, అమృత తేజ, విజయ్‌కుమార్, మనోహర్ పాల్గొన్నారు.

ఎడతెరపి లేని వర్షం..!

- మొరవపోతున్న పలు చెరువులు
- చెలిమిచేను జలపాతం పరవళ్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు
- పలు ప్రాంతాల్లో రాకపోకలకు ప్రజల అవస్థలు



వి.కోట: వర్షానికి పాడైన గ్రామీణ రోడ్డు



వి.కోట: గంగమ్మ ఏరులో రాకపోకలకు అవస్థలు

రామకుప్పం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో కుంటలు, చెరువుల్లోకి వర్షపు నీరు చేరాయి. ఎస్.గొల్లపల్లె, సింగసముద్రం చెరువుల్లో భారీగా వర్షపునీరు చేరి జలకళ సంతరించుకున్నాయి. అడవిలోని కుంటలు, చెక్ డ్యాంలు నిండాయి.

● **బైరెడ్డిపల్లె:** మండలంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తీర్థం పంచాయతీ పరిధిలోని వెంకటపతయ్యచెరువు, చింతామణయ్యచెరువు, కొత్రేపల్లె చెరువుతోపాటు చిన్నచిన్న కుంటలు నిండి మొరవపోతున్నాయి. పలు పంటలు నీట మునిగాయి.

● **వి.కోట:** వి.కోట మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో పలు ప్రాంతాలు బురదమయమయ్యాయి. మంజునాథ థియేటర్ పక్కన ఉన్న లేఅవుట్ మీదుగా వర్షం ప్రవహించడంతో రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయి నడవడానికి వీలులేనంతగా గుంతలమయమైంది. ఈ మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీగా కురిసిన వర్షం ధాటికి యర్రంపల్లెకు ఎగువనున్న కాలువ గట్టు పక్కన రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం నెలకొంది. రాత్రికి రాత్రే జవ్వునిపల్లె క్రాస్ వద్ద మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించారు. నీటి ప్రవాహం ధాటికి చిన్నశ్యామ చెరువు పూర్తిగా నిండి నాగిరెడ్డిపల్లె చెరువుకు మొరవ ప్రవహిస్తోంది. సుమారు వంద ఎకరాల్లో పంట పొలాలు నీటమునిగాయి. వి.కోట పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

● భారీ వర్షాలతో హంద్రీ-నీవా కాలువకు వరద నీరు పోటెత్తడంతో కాలువ దిగువనున్న చెరువులకు జలకళ సంతరించుకుంది. పైపల్లె రాయప్ప చెరువు, పత్రపల్లె చెరువు, చిన్నశ్యామచెరువు, నాగిరెడ్డిపల్లె చెరువు పూర్తిగా నిండి దిగువకు మొరవలు ప్రవహిస్తున్నాయి. కుంబార్లపల్లె నుంచి కల్లుపల్లెకు వెళ్లే ఏరు ప్రవహిస్తుండటంతో ఈ మార్గంలో రాకపోకలకు అంతరాయం నెలకొంది. ఓ వైపు చెరువులకు జలకళ సంతరించుకోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బైరెడ్డిపల్లె: మొరవపోతున్న కొత్రేపల్లె చెరువు



జలకళ సంతరించుకున్న సింగసముద్రం చెరువు

క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో గత రెండురోజులుగా జరిగిన మండల స్థాయి క్రీడాపోటీల్లో విజేతలకు శుక్రవారం పాఠశాలల హెచ్‌ఎంలు సరిత, దేశాయమ్మ బహుమతులు ప్రదానం చేశారు. అండర్-14 బాలుర విభాగం చెస్‌లో పెద్దచెల్లారగుంట ప్రథమ, బైరెడ్డిపల్లె జడ్పీ హైస్కూల్ ద్వితీయస్థానం, అండర్-17 బాలుర విభాగంలో కడపనత్తం ప్రథమ, కమ్మనపల్లె ఆదర్శ పాఠశాల నుంచి ద్వితీయస్థానం సాధించారు. అండర్-14 చెస్ బాలికల విభాగంలో కడపనత్తం ప్రథమ, పెద్దచెల్లారగుంట ద్వితీయ, అండర్-17 విభాగంలో పెద్దచెల్లారగుంట ప్రథమ, కమ్మనపల్లె గురుకుల పాఠశాల నుంచి ద్వితీయస్థానం సాధించారు. విజేతలను అభినందించి జ్ఞాపికలందజేశారు. స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ పీడీ చిరంజీవి, నిర్వాహకులు సుజాత, షహీనా, శాంతి, మోహన్, ప్రవీణ, తాజ్, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేకశ్రద్ధ ఉండాలి



ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యసంరక్షణపై ప్రతిఒక్కరూ ప్రత్యేకశ్రద్ధ కలిగి ఉండాలని బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారులు విజయచందర్, అరుణ్‌కుమార్ అన్నారు. స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బైరెడ్డిపల్లె, మూగనపల్లెలో వైద్య శిబిరాలు నిర్వహించారు. పీహెచ్‌సీలో 10 మంది టీబీ రోగులకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మురళీ, సల్మా, ఆరోగ్య విద్యాధికారులు కాంతమ్మ, సావిత్రి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సమతుల్య ఆహారం ఆరోగ్యకరం



గర్భిణులకు సూచనలిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

రొంపిచెర్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ సమతుల్యమైన ఆహారం తీసుకోవడంతో ఆరోగ్యకరంగా ఉంటారని సీడీపీవో వాణిశ్రీదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని రొంపిచెర్ల, వారణాసివారిపల్లె అంగన్వాడీ కేంద్రాల్లో జాతీయ పోషణ మాసం పురస్కరించుకొని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆహారపు అలవాట్లు, పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శిరీష, సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్, బీసీ మండలాధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, అంగన్వాడీ కార్యకర్తలు అలివేలు, లక్ష్మీదేవి, సంపత్‌కుమారి, హసీనా పాల్గొన్నారు.

బీసీల్లో రాజకీయ చైతన్యం తీసుకురావాలి

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన కులాల్లో రాజకీయ చైతన్యం తీసుకురావడానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు పుంగనూరు నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించేలా చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు అద్దాల నాగరాజ, నారాయణస్వామి, విజయ్‌కుమార్, చిట్టెమ్మ, ప్రతిభ, షబానా, కృష్ణమూర్తి, రెడ్డెప్ప, నాగరాజ, గోగులప్ప తదితరులు పాల్గొన్నారు.

రూ.35 లక్షలతో పుంగనూరు మార్కెట్ యార్డు అభివృద్ధి పనులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ శమిపతి

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో అభివృద్ధికి రూ. 35 లక్షతో పనులు చేయనున్నట్లు ఏఎంసీ చైర్మన్ శమిపతి తెలిపారు. శుక్రవారం స్థానిక ఏఎంసీ కార్యాలయంలో జరిగిన నూతన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సూచలనల మేరకు ప్రభుత్వం ప్రస్తుతం రూ.35 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. వివిధ అభివృద్ధి పనుల కోసం ప్రస్తుతం కోటి రూపాయలకు ప్రణాళికలు తయారు చేసినట్లు చెప్పారు. పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డును ఆదర్శంగా తీర్చిదిద్దడానికి సభ్యుల సహకారం అవరమన్నారు. పుంగనూరు చింతపండుకు నిలయమని, వాటి నిల్వల కోసం ప్రత్యేక కోల్డ్ స్టోరేజ్‌లను ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేయాల్సి ఉందన్నారు. పశువుల సంత, గొర్రెల సంతలను మరింత అభివృద్ధి చేసి ఆదాయ వనరులను సమకూర్చడానికి కృషి చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో ఏఎంసీ ప్రత్యేక కార్యదర్శి గోపినాథ్, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గౌనివారి శ్రీనివాసులుకు సత్కారం



శాంతిపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులును శుక్రవారం మండల పార్టీ అధ్యక్షులు నందిగం ఉదయ్ కుమార్ ఇతర టీడీపీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ ఇంటి వద్ద ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మండల టీడీపీ నేతలు పీవీ నాగరాజు, చంద్రశేఖర్, గిరి, మురళీ, విజయ్‌కుమార్, రాజేంద్ర, మంజునాథ్, శివశంకర్, రామకృష్ణ, భాస్కర్, రాజారెడ్డి పాల్గొన్నారు.

మహిళలే కుటుంబాలకు ఆధారం



మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

కల్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన మహిళలే శక్తివంతమైన కుటుంబాలకు ఆధారం అని ఇన్‌చార్జి ఎంపీడీవో మునిరాజ, వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం మంగళంపేటలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యను గుర్తించి అవసరమైన వారికి తగిన వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. గర్భిణులు ప్రసూతి పరీక్షలు నిర్వహించుకోవడంతో ప్రసవ సమయంలో దుష్ఫలితాలు రాకుండా ఉంటాయని.. తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని తెలిపారు. వైద్య శిబిరంలో మహిళలకు రక్తపోటు, మధుమేహం, హిమోగ్లోబిన్, క్షయ నిర్ధారణ తదితర పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ మధు, టీడీపీ నాయకులు సయ్యద్‌బాషా, గోపాల్, నూరి, రామ్మూర్తి, ప్రభాకర్, రియాజ్, పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, శివశంకర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● **పెద్దపంజాణి:** మండలంలోని పెద్దవెలగటూరు పంచాయతీలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మధుమేహం, బీపీ, మలేరియా, డెంగీ, క్యాన్సర్ వ్యాధులకు రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి మురళీ , ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పొంగుతున్న వాగులు, వంకలు

పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు ● ఇబ్బందుల్లో జనం




గట్రాళ్లమిట్టలో ఇళ్ల మధ్య నిలిచిన వర్షపు నీరు - నారగల్లు చెరువు కట్టవద్ద ప్రమాద హెచ్చరికగా ఎర్రగుడ్డ కట్టిన అధికారులు

గుడిపాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగుతున్నాయి. గట్రాళ్లమిట్టకు సమీపంలోని వంక పొంగి ఇళ్ల మధ్యకు చేరాయి. కొన్ని ఇళ్లలోకీ నీరు చేరింది. గురుగునత్తం రైల్వే బ్రిడ్జి కింద ఉధృతంగా నీరు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. చలిచీమలపల్లె, నారగల్లు, 197 రామాపురం, చీలాపల్లె గ్రామాలకు వెళ్లే రహదారిపై వర్షపు నీరు ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందులు నెలకొన్నాయి.

కృష్ణాపురం రిజర్వాయర్‌కు వర్షపునీరు

● అప్రమత్తంగా ఉండాలని ఉద్యోగులకు ఇరిగేషన్ ఈఈ సూచన



కృష్ణాపురం రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఈఈ మురళీకుమార్ తదితరులు

వెదురుకుప్పం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కృష్ణాపురం రిజర్వాయర్‌కి వర్షపు నీరు వస్తోందని, అప్రమత్తంగా ఉండాలని ఉద్యోగులకు ఇరిగేషన్ ఈఈ జి.మురళీకుమార్ సూచించారు. శుక్రవారం రిజర్వాయర్‌ను, పరిసరాలను ఆయన తనిఖీ చేశారు. ఆయనవెంట డీఈఈ వరప్రసాద్‌రెడ్డి, ఏఈఈ భాస్కర్‌రాజీవ్, కృష్ణాపురం జలాశయం చైర్మన్ అన్నామలై, టీడీపీ కార్వేటినగరం మండల అధ్యక్షుడు చెంగల్రాయయాదవ్, టీడీపీ నాయకులు రాజా, మాజీ సర్పంచ్ చిరంజీవి ఉన్నారు.

ఉరుస్తున్న పెనుమూరు పశువైద్యశాల భవనం



పెచ్చులూడిన స్లాబు

పెనుమూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పెనుమూరులోని పశువైద్యశాల భవనం పైకప్పు పెచ్చులూడి ఉరుస్తోంది. వర్షాలు కురుస్తుండటంతో భవనం నుంచి వర్షపు నీరు కారుతుండటంతో వైద్యులు కూర్చోవడానికి కూడా స్థలం లేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి నూతన భవన నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

● ఎస్ఈ కార్యాలయం ఎదుట విద్యుత్ జేఏసీ రిలే దీక్ష



దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న నాయకులు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కారించాలని కోరుతూ శుక్రవారం గిరింపేటలోని ఎస్ఈ కార్యాలయం ఎదుట జేఏసీ నాయకులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నా.. యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు నేరుగా యాజమాన్యమే వేతనాలు చెల్లించాలని కోరారు. జేఎల్ఎం గ్రేడ్-2లను రెగ్యులర్ ఉద్యోగులుగా పరిగణించి వేతనాలు, ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించకుంటే ధర్నా కొనసాగిస్తామన్నారు. జేఏసీ నాయకులు కృష్ణయ్య, యజ్ఞనేశ్వర్, దేవేంద్ర, వివేకానందరెడ్డి, చంద్రశేఖర్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

వెంగల్రాజుకుప్పంలో క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈవో రాజేంద్రప్రసాద్

పాలసముద్రం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వెంగల్రాజు కుప్పం జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం మండల స్థాయి క్రీడాపోటీలను ఎంఈవో రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్ పోటీలను రెండ్రోజులపాటు నిర్వహిస్తామని తెలిపారు. ఎంఈవో-2 గిరిజ, హెచ్ఎం శ్రీహరి, పీఈటీలు కృష్ణయ్య, హరి, అన్నరసు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ప్రదోషకాల పూజలు

వెదురుకుప్పం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం సమీపంలోని శిష్ట సౌందర్యవల్లి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రదోషకాల పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఏర్పాట్లను కార్యనిర్వాహకులు పర్యవేక్షించారు.

ప్రత్యేక అలంకరణలో నందీశ్వరుడు →



సచివాలయాల్లో ఎంపీడీవో తనిఖీలు

వెదురుకుప్పం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండల కేంద్రంలోని ఒకటి, రెండు, మూడు సచివాలయాలను ఎంపీడీవో చంద్రమౌళి శుక్రవారం తనిఖీ చేశారు. ఉద్యోగులకు పలు సూచనలిచ్చారు.

ఏట్లో తెగిపోయిన మట్టి రోడ్లు



దేవళంమిట్ట - నరసింగరాయనిపేట మధ్యలో..

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలం కలవకుంట ఎన్టీఆర్ జలాశయం ఒకటి గేట్ ఎత్తి దిగువ ప్రాంతానికి వదలడంతో నీవానదిలో నీటి ప్రవాహం పెరిగింది. దీనివల్ల గంగాధర నెల్లూరు మండలంలోని ఆత్మకూరు పంచాయతీ దేవళంమిట్ట - నరసింగరాయనిపేట (చిత్తూరు మండలం), అదే గంగాధరనెల్లూరు మండలం కలిజవేడు - ముకుందరాయనిపేట (కొట్రకోన పంచాయతీ) మధ్య నీవానది ఏటిలోని మట్టిరోడ్లు గురువారం అర్ధరాత్రి తెగిపోయాయి. ఈ రెండు ప్రాంతాలకు చెందిన ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



కలిజవేడు - ముకుందరాయనిపేట మధ్యలో..

మొరవ పారుతున్న నుంజర్ల ప్రాజెక్టు

● ఇంద్రవరదుడి ఆలయాన్ని తాకిన నీవానది నీరు



వరదరాజస్వామి ఆలయం ఎదురుగా ఉరకలెత్తుతున్న నీవానది

యాదమరి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండలంలో నాలుగురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు భూమిరెడ్డిపల్లె వద్ద ఉన్న నుంజర్ల ప్రాజెక్టు పూర్తిగా నిండి, మొరవపారుతోంది. దీనివల్ల చాలా కాలం తర్వాత నీవానదిలో నీటి ప్రవాహం కనిపించిందని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు ఈ నీటి ప్రవాహం యాదమరి త్రివేణి సంగమం వద్ద శుక్రవారం ఇంద్రవరదుడి ఆలయాన్ని తాకింది. దెబ్బతిన్న కాలువలకు మరమ్మతులు చేస్తే చాలా చెరువులను నీవానది నీటిని నింపే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. దీనివల్ల భూగర్భ జలమట్టం పెరగడంతో పాటు నీటి ఎద్దడిని నివారించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉధృతంగా నీవానది ప్రవాహం

పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండండి: కమిషనర్



అధికారులతో కలిసి నీవానది పరివాహక ప్రాంతంలో పర్యటిస్తున్న నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నీవానది పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ చెప్పారు. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు నదిలో నీటి ప్రవాహం పెరిగింది. కల్వర్టులపైకి నీటి ప్రవాహం రావడంతో కమిషనర్ శుక్రవారం తేనబండ, వీరభద్రకాలనీ, ధర్మరాజులగుడి ప్రాంతాల్లో పర్యటించారు. నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. నీవానది వంతెనలు, కల్వర్టుల వద్ద అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. ఎంహెచ్‌వో లోకేష్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నింద్ర, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరి, నింద్ర, విజయపురం మండలాల్లో సబ్ స్టేషన్ల నిర్వహణ నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ ప్రభాకర్ తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాల్య వివాహాలతో నష్టాలపై అవగాహన

పాలసముద్రం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో జరిగే నష్టాలపై ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ హేమలత, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ షణ్ముగం, అధ్యాపకులు సుశీల, రమ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా స్పేస్ రెవల్యూషన్ డే

నింద్ర, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పేస్ రెవల్యూషన్ డేని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రాజు, భౌతిక శాస్త్ర విభాగాధిపతి, కార్యక్రమ కో-ఆర్డినేటర్ టి.సుహాసిని, అధ్యాపకులు గిరీష్‌కుమార్, అరుణ కుమారి, ఉమామహేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

కవితల పోటీలకు ఆహ్వానం

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరాభివృద్ధిని వర్ణిస్తూ అభ్యుదయ రచయితలు 25 పంక్తులకు మించకుండా తమ కవితలను ఈనెల 25వ తేదీలోపు పంపాలని స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వాహకులు కోరారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.2వేలు, రూ.వెయ్యి, రూ.500 ఇస్తామన్నారు. తమ కవితలను చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ, 12-127 బజారు వీధి, చిత్తూరు అనే చిరునామాకు పంపాలని కోరారు. వివరాలకు 96183 40444 నెంబరును సంప్రదించాలని సూచించారు.

ఓటర్ల జాబితాపై నేడు సమావేశం

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు తహసీల్దార్ ఆఫీస్‌లో శనివారం ఉదయం 10.30 గంటలకు నియోజవర్గంలోని వివిధ రాజకీయపార్టీల నేతలతో ఓటర్ల జాబితాపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఓటర్ల జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల మార్పు, చేర్పులపై రాజకీయనేతల సూచనలు, సలహాలు తీసుకుంటామన్నారు.

వ్యాను ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు



గుడిపాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వ్యాను ఢీకొని ఓ వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ రామ్మోహన్ తెలిపిన వివరాల మేరకు.. పానాటూరు సమీపంలో కృష్ణా గ్రానైట్ ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం ఉదయం ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా వెనుకవైపు నుంచి వ్యాను ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమవడంతో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వ్యక్తిగత వివరాలు తెలియలేదని, పరిస్థితి విషమంగా ఉందని ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 94407 96712 నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కల్వర్టును ఢీకొన్న బైక్

● యువకుడి దుర్మరణం



రాజ్ కమల్(ఫైల్ ఫొటో)

నింద్ర, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కల్వర్టును బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరి పట్టణం వీకేఎస్ లేఅవుట్‌లో నివాసం ఉంటున్న రాజ్‌కమల్ (35) శుక్రవారం తిరుత్తణికి బైక్‌పై వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. మార్గమధ్యంలో వీకేఆర్‌పురం వద్ద కల్వర్టును ఢీకొని తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి / అధికారులు, సిబ్బందికి కలెక్టర్ ఆదేశం



ఒంటిల్లు గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

గుడిపాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు, సిబ్బందిని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఒంటిల్లు గ్రామాన్ని ఆయన సందర్శించారు. తమ గ్రామం మీదుగా ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం చేపట్టడంతో శ్మశానానికి దారి లేకుండా పోయిందని, తీవ్ర ఇబ్బంది పడుతున్నామని 'పీజీఆర్ఎస్'లో స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన పరిశీలించి.. అప్రోచ్ రోడ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కమ్మతిమ్మాపల్లె జడ్పీ హైస్కూల్ తనిఖీ చేశారు. మరుగుదొడ్లకు, కూలిపోయిన ప్రహరీ మరమ్మత్తులకు రూ.లక్షలను అప్పటికప్పుడే మంజూరు చేశారు. అలాగే పాఠశాలలో మౌలిక సదుపాయాలకు అవసరమైన నివేదికలు అందజేయాలని హెచ్ఎంను ఆదేశించారు. అలాగే చలిచీమలపల్లె చెరువు వర్షాలకు పొంగి గ్రామంలోకి పారుతుండటంతో గమనించిన ఆయన వెంటనే కల్వర్టు నిర్మాణానికి ఆదేశాలు జారీ చేశారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఇన్‌చార్జి ఎంపీడీవో కుమార్, ఏఈలు ప్రసాద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అమూల్ డెయిరీ వద్ద వీర రాఘవులు నాయుడు విగ్రహం



చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అమూల్ డెయిరీ వద్ద మళ్లీ రాయలసీమ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ ఎన్‌పీ వీర రాఘవులు నాయుడు విగ్రహ ఏర్పాటు పనులు జోరందుకున్నాయి. అప్పట్లో రైతుల సంక్షేమం కోసం చిత్తూరులో పాల డెయిరీ అవసరమని తిరుమలకు వచ్చిన ముఖ్యమంత్రి జలగం వెంగళరావును వీర రాఘవులు నాయుడు కలిసి, విన్నవించారు. ఆయన వినతితో ప్రభుత్వం చిత్తూరు- వేలూరు రోడ్డులో విజయ డెయిరీ ఏర్పాటైంది. కొన్ని అనివార్య కారణాలతో డెయిరీ మూతపడింది. రెండేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం అమూల్ డెయిరీకి విజయ డెయిరీని లీజుకిచ్చింది. వారు డెయిరీకి మరమ్మతులు చేపట్టిన సమయంలో ప్రధాన గేటు వద్ద ఉన్న వీరరాఘవులు నాయుడు విగ్రహాన్ని తొలగించారు. దీనిపై టీడీపీ నేతలు నిరసనలు తెలపడంతో మరమ్మతులు పూర్తయ్యాక వీర రాఘవులు నాయుడు విగ్రహాన్ని తిరిగి అదే చోట ఏర్పాటు చేస్తామని నగరపాలక అధికారులు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం తిరిగి విగ్రహాన్ని పెట్టడంపై టీడీపీ నేతలు, వీర రాఘవులునాయుడు శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నగరిలో దస్తావేజు లేఖకుల నిరసన



నింద్ర, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్డు ప్రైమ్ 2.0 రద్దు చేసి.. పాత పద్ధతినే కొనసాగించాలని దస్తావేజుల లేఖకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఈ మేరకు స్టాంపు వెండార్లు, డీటీపీ ఆపరేటర్లతో కలిసి నిరసన తెలిపారు. నూతన విధానాలతో తమ పొట్ట కొట్టవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దస్తావేజు లేఖకులు, డీటీపీ చేసేవారు కూడా ఆర్థికంగా నష్టపోతారని చెప్పారు. తమకు లైసెన్సులు ఇవ్వాలని, ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. శనివారం కూడా పెన్‌డౌన్ చేస్తున్నట్లు ప్రకటించారు.

మల్లిరెడ్డి కుంటలో ఆక్రమణల తొలగింపు



సర్వే చేసిన రెవెన్యూ అధికారులు

పెనుమూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చార్వాగానిపల్లె రెవెన్యూలో సర్వే నెంబరు 4-2లో ఐదెకరాల మల్లిరెడ్డి కుంట ఆక్రమణకు గురైందని, సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని 2017లో సీఎంవో నుంచి సమాచారం వచ్చింది. దీనిపై ఆక్రమణదారు కోర్టుకు వెళ్లగా విచారణ పూర్తయ్యాక ఈ ఏడాది జూలైలో ఆక్రమణలను తొలగించాలని ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ క్రమంలో శుక్రవారం తహసీల్దారు శ్రావణ్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ భరత్, పోలీసులు సమక్షంలో ఆ కుంటను సర్వే చేసి.. ఆక్రమణలను తొలగించి, హద్దులు నాటారు.

సీఎం చంద్రబాబును కలిసిన మోహన్ నాయుడు



గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్‌తోపాటు వెళ్లి గంగాధరనెల్లూరు సింగిల్‌విండో సొసైటీ చైర్మన్ ముప్పిరి మోహన్ నాయుడు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విండో అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. థామస్ సహకారంతో తనకు పదవి ఇవ్వడంపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీవి ఉత్తుత్తి నిరసనలు: టీడీపీ

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉనికి కాపాడుకోవడానికే వైసీపీ ఉత్తుత్తి నిరసనలు, ధర్నాలు చేస్తోందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పీపీపీ మోడ్‌లో మెడికల్ కాలేజీల నిర్మాణంపై వైసీపీ తప్పుడు ప్రచారాలు చేస్తూ నిరసనలు, ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు వెళ్లకుండా.. బయట నిరసనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో పది మెడికల్ కాలేజీలను సీఎం చంద్రబాబు ప్రైవేట్‌పరం చేస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. 17 మెడికల్ కాలేజీలు నిర్మించానని గొప్పలు చెప్పుకునే మాజీ సీఎం జగన్.. వాటి నిర్మాణానికి ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదని మండిపడ్డారు.

ఎస్టీలకు జనన ధ్రువీకరణ పత్రాల అందజేత

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాపాక్షి డివిజన్‌లోని శేషాచలపురం ఎస్టీకాలనీలో పలువురు చిన్నారులకు జనన ధ్రువీకరణ పత్రాలను కమిషనర్ నరసింహ ప్రసాద్ శుక్రవారం అందించారు. ఎస్టీల సమగ్ర అభివృద్ధి చర్యల్లో భాగంగా కలెక్టర్ ఆదేశాలతో శుక్రవారం సాయంత్రం చిన్నారుల తల్లిదండ్రులను కార్యాలయానికి పిలిపించి, జనన ధ్రువపత్రాలను అందించారు. ఎంహెచ్‌వో లోకేష్, ఏఎస్‌వో కరుణాకరన్ తదితరులు పాల్గొన్నారు.

'కార్వేటినగరాన్ని తిరుపతి జిల్లాలో చేర్చాలి'



కార్వేటినగరం గాండ్లమిట్ట కూడలిలో నినాదాలు చేస్తున్న స్థానికులు

వెదురుకుప్పం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలాన్ని తిరుపతి జిల్లాలో చేర్చాలంటూ శుక్రవారం కార్వేటినగరం గాండ్లమిట్ట కూడలి ప్రాంతంలో స్థానికులు నినాదాలు చేశారు. తిరుపతికి సమీపంలో ఉన్న మండలాన్ని ఆ జిల్లాలో చేర్చకపోవడం ఏంటని ప్రశ్నించారు. గతంలో కార్వేటినగరం పర్యటనకు వచ్చిన సందర్భంలో కూడా టీడీపీ అధినేత చంద్రబాబు తిరుపతి జిల్లాలో చేరుస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కుమార్, ధనంజయవర్మ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలోని పిల్లలను సొంత బిడ్డల్లా చూసుకోవాలి

● కలెక్టర్ సుమిత్‌కుమార్



పి.కొత్తకోటలో బాలుర వసతి గృహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

పూతలపట్టు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న పిల్లలను సొంత బిడ్డల్లాగా చూసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. శుక్రవారం పి.కొత్తకోట సమీపాన ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహాన్ని ఆయన తనిఖీ చేశారు. వసతిగృహంలో విద్యార్థుల సంఖ్య పెరుగుతుండడం వల్ల అదనపు పడక గదులు, మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు పనులు త్వరగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విక్రమ్‌కుమార్ రెడ్డి, హాస్టల్ వార్డెన్ జయచంద్రారెడ్డి, తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో నాగరాజు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, స్థానిక టీడీపీ నేత బాబురావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



చెరువును తలపిస్తున్న పాలేరు సర్వీస్ రోడ్డు

బంగారుపాళ్యం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి పాలేరు ఫ్లైవోవర్ వద్ద నుంచి పలు గ్రామాలకు వెళ్లే సర్వీసు రోడ్డులో వర్షపు నీరు వెళ్లడానికి కాలువ నిర్మాణం చేపట్టలేదు. దీనివల్ల వర్షం వస్తే నడుము లోతు నీరు నిలిచిపోయి.. చెరువును తలపిస్తోంది. గురువారం రాత్రి కురిసిన వర్షానికి ఈ సర్వీస్ రోడ్డులో నీరు నిలిచింది. దీనివల్ల పాలేరు, శేషాపురం, బండపల్లె, మోతగుంట, పాలమాకులపల్లె, ఇందిరానగర్‌కు వెళ్లే గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా హైవే అథారిటీవారు మండల అధికారులు దృష్టిని సారించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.